ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 20 ఫిబ్రవరి 2025 | 5






ఏ వెండి.. పెరుగుతుందండీ!

- రూ.లక్షకు చేరువలో వెండి ధరలు
- కిలో రూ.99,800.. బంగారం పైపైకే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వెండి ధరలు బంగారంతో పోటీ పడుతున్నాయి. ఇవాళ్టికిలో వెండి ధర రూ.లక్షకు చేరువగా ఉంది. ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.99,800గా ఉంది. బంగారం ధర పది గ్రాముల 22 క్యారెట్ ధర 80,350 అయింది. ఇంకా ఈ ధరలు పెరిగే అవకాశాలున్నట్టు మార్కెట్ అంచనా. బంగారం, వెండి ఆభరణాలంటే మహిళలకు ఎంతో మోజు. పురుషులూ ఈమధ్య వీటిపై మోజు పెంచుకుంటున్నారు. సాధారణంగా వెండి కంటే బంగారం ధరించడానికి స్త్రీ, పురుషులు ఇష్టపడతారు. వెండితో సాధారణంగా ప్లేటులు, గ్లాసులు వంటి వస్తువులను ఇంటిలోకి ఉపయోగిస్తారు. పూజా సామగ్రి కూడా వెండివే వినియోగిస్తారు. ఇటీవల పెట్టుబడి కింద కూడా వెండిని ఉపయోగిస్తున్నారు. వెండిబారులు ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు. ఇవి 50 గ్రాముల బారు నుంచి కిలో బారు వరకూ ఉంటుంది. ఇవికాకుండా గోల్డ్ కోటెడ్ వెండి ఆభరణాలకు ధరించే ట్రెండ్ నడుస్తోంది. వెండి పట్టీలు ఎలాగూ ప్రతీ మహిళా ధరిస్తారు. బంగారం ధరలు పెరగడం, చోరీల నుంచి రక్షణ పొందేందుకు ఇలా వెండి నగలను ధరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బంగారం ధరతోపాటు వెండి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులూ వెండి ధరలను ప్రభావితం చేస్తున్నాయి. కొంతకాలంగా బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్న సంగతి తెలిసిందే. బంగారంతోపాటు వెండి ధరలు కూడా పోటీపడుతుండడం విశేషం. గతవారంలో కిలో వెండి ధర రూ.99,900 పలికింది. తర్వాత రూ.200 తగ్గి కిలో రూ.99,700గా కొనసాగింది. బుధవారం మళ్లీ పెరిగిపోయి 99,800 అయింది. ఇది ఇంకా తగ్గుతుందా, పెరుగుతుందా అనే అంచనా వేయలేని పరిస్థితి ఉంది. అయితే కిలో వెండి రూ.లక్ష ధర పలికే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. వినియోగదారులు ప్రస్తుతం వెండి కొనుగోలు చేద్దామంటే ధర ఎక్కువ ఉంది. తర్వాత కొనుగోలు చేయవచ్చని వాయిదా వేద్దామంటే మరింత పెరిగిపోతుందేమోననే ఆందోళన ప్రజల్లో ఉంది. జనవరి ఒకటిన కిలో వెండి ధర రూ.88,400 ఉంది. నెలా పదిహేను రోజుల తర్వాత అంటే ఇవాళ కిలో ధర రూ.99,800లకు చేరింది. బుధవారం నాడు బంగారం 22 క్యారెట్ పది గ్రాముల ధర 80,350, 24 క్యారెట్ బంగారం ధర రూ.87,650 ఉంది.



చిదిమేస్తున్నారు!

మోసగాళ్ల చెరలో మైనర్లు



మాయమాటలతో, విష సంస్కృతో అభంశుభం తెలియని బాలికలను విష వలయంలోకి నెట్టేస్తోంది. ఆ వలయంలో చిక్కిన వారి జీవితాలు అగాధంలో పడిపోతున్నాయి. తర్వాత లేచి చూస్తే.. అంతా చీకటే. ఎంతో భవిష్యత్తును చూడాల్సిన మైనర్లు జీవచ్ఛవాలుగా మిగిలిపోతున్నారు. మైనర్లపై ఇటీవల అత్యాచారాలు జరుగుతున్న ఉదంతాలెన్నో నమోదవుతున్నాయి. ఈవారం పది రోజుల్లోనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక ఘటనలు పోలీసు కేసులయ్యాయి. కేసుల దాకా రానివీ మరెన్నో ఉంటాయి. వీరికి న్యాయం జరుగుతుందా, నిందితులకు శిక్ష పడుతుందా.. ఇంతవరకే మనం ఆలోచించగలం. కానీ అఘాయిత్యానికి గురైన మైనర్లు, మహిళల భవిష్యత్తు మాత్రం గాఢాంధకారమే. పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే కొంతవరకైనా కట్టడి అయ్యే అవకాశం ఉంటుంది.

- బాలికలకు భద్రత కరవు
- పోక్సో కేసులే దానికి రుజువు
- రోజురోజుకూ మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు
- ప్రేమ పేరుతో వలలో చిక్కుతున్న యువతులు
- స్మార్ట్ ఫోన్ల బంధాలతోనూ వాటిల్లుతున్న పెనుముప్పు
- జిల్లాల్లో పెరిగిపోతున్న మిస్సింగ్ కేసులు

(రాజమహేంద్రవరం/సామర్లకోట/మండపేట/ముమ్మిడివరం/మలికిపురం- ఆంధ్రజ్యోతి)

బాలికలకు, మహిళలకు భద్రత కరువైంది. ప్రధానంగా ప్రేమపేరుతో బాలికలు, యువతులు మోసగాళ్ల చెరలో చిక్కుతున్నారు. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మిస్సింగ్ కేసుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నాయి. దీనికి కుటుంబ పరిస్థితులు, గృహహింస, తల్లిదండ్రుల సంబంధాలు, తల్లి లేదా తండ్రి ఒక్కరే ఉండడంతో ఒంటరితనం, మద్యం వంటి వాటికి బానిస కావడం, పిల్లలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, సామాజిక మాధ్యమాల ప్రభావం, ఆకర్షణలకు గురికావడం ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయని కిర్లంపూడి పీహెచ్‌సీలో వైద్యునిగా పనిచేస్తున్న డాక్టర్ ప్రసాద్ చెప్పారు. నిజమే, ప్రధానంగా స్మార్ట్‌ఫోన్ల వల్ల ఆడ, మగ తేడా లేకుండా జీవితాలు పట్టు తప్పుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అత్యాచారం, అదృశ్యం కేసుల్లో లోతుల పరిశీలన చేస్తే చివరికి సెల్‌ఫోన్ కారణమని తేలుతోంది. కలిసి చదువుకుంటున్నాం.. కలిసి తిరిగేస్తే తప్పేంటనే తొందరపాటే అమ్మాయిల జీవితాలను ప్రశ్నల కూపంలోకి నెట్టేస్తోంది. ప్రేమ.. ఆకర్షణ.. అవసరం.. వాంఛ.. వీటి మధ్య ఉన్న సున్నితమైన గీతను గుర్తించడంలో విఫలమవుతున్న అమ్మాయిలు అమాయకంగా తమంతట తాముగా వెళ్లి జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు.

ఇవి కొన్నే...

మాయ మాటలతో వ్యభిచారంలోకి

అనకాపల్లి జిల్లాకు చెందిన 17ఏళ్ల బాలికను కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన చందు ప్రేమపేరిట మాయమాటలు చెప్పి గతేడాది చివరల్లో ఇక్కడకు తీసుకువచ్చాడు. ఆ తర్వాత తన ప్రణాళిక ప్రకారం బాలికను వ్యభిచారంలోకి దింపేందుకు తన తల్లిని వినియోగించాడు. ఈ కూపంలో ఆ బాలికకు ఇన్ఫెక్షన్ సోకడంతో వైద్యం చేయించారు. బాధలతోపాటు తల్లీకొడుకులు పెట్టే బాధలు భరించలేక గతేడాది చివర్లోనే ఆమె చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్సలో ఆ బాలిక ఆరోగ్యం మరింత క్షీణించింది. పోలీసులకు ఫిర్యాదు అందడంతో తీగలాగితే డొంక కదిలింది. పెద్దాపురం పోలీసులు రంగప్రవేశం చేసి బాలికను మోసగించి, వేధింపులకు పాల్పడిన తల్లీకొడుకులను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బాలిక ఆస్పత్రిలో అవసానదశలో చికిత్స పొందుతోంది. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

8వ తరగతి బాలికను చెరపట్టి...

ముమ్మిడివరం మండలం అనాతవరం గ్రామానికి చెందిన పరమట దుర్గాప్రసాద్ (30) ఎలియాస్ బులిచంటి 8వ తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికపై కన్నేశాడు. గత సోమవారం ఆ బాలిక ఇంటి నుంచి పాఠశాలకు తోటి విద్యార్థినులతో కలిసి వెళ్లి స్కూలు వద్ద బస్సు దిగగా దుర్గాప్రసాద్ మోటారు సైకిల్‌పై వచ్చి ఆమెకు మాయ మాటలు చెప్పి బలవంతంగా మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని అమలాపురం ఎర్రవంతెన సమీపంలోని ఒక నివాస గృహంలోకి తీసుకువెళ్లి శారీరకంగా అనుభవించాడు. ఈ విషయం తెలిసిన ఆ బాలిక తండ్రి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదుచేసి ఆ బాలికను వైద్య పరీక్షలకు పంపించి నిందితుడిపై పోక్సో అత్యాచార కేసును నమోదుచేశారు.

ప్రేమ పేరిట వేధించి.. ఆత్మహత్యకు పురిగొల్పి..

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం మాధవపట్నంలో అనుసూరి విఘ్నేశ్ అనే యువకుడి వేధింపులకు తాళలేక మూడు రోజుల కిందట 17 ఏళ్ల బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. గతంలో అతడు ఆ బాలికను ప్రేమపేరిట వేధించేవాడు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు అప్పట్లో అతడిపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి జైలుకు పంపారు. కొన్నాళ్లకు బెయిల్‌పై బయటకు వచ్చిన అతడు ఆ బాలిక వద్దకు వెళ్లి పెళ్లి చేసుకుంటానని తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేశాడు. మాయమాటలకు లొంగిన ఆ బాలిక వివాహం చేసుకుంది. కొంతకాలం అదే గ్రామంలో ఇద్దరూ కాపురం పెట్టారు. ఇటీవల కాలంలో ఆమెపై వేధింపులు పెరిగాయి. రెండు రోజులుగా వారిద్దరి మధ్య ఘర్షణలు జరగ్గా ఆమెను శారీరకంగా వేధించాడని తెలిసింది. సోమవారం రాత్రి ఆమె అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు విఘ్నేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఫొటోలు పంపి.. వేధించాడు...

రాజమహేంద్రవరం నగరానికి చెందిన ఓ అమ్మాయికి ఓ యువకుడు పదేపదే ఫోన్లు చేసి వేధిస్తున్నాడు. ఆమె ఎన్ని ఫోన్ నెంబర్లు మార్చినా ఫలితం లేకపోతోంది. చివరికి ఆమె తండ్రికి ఆమె పర్సనల్ ఫొటోలు పంపించాడు. అది చూసి ఆ తండ్రి గుండె పగిలినంత పనైంది. కూతురిని గట్టిగా నిలదీస్తే కథ బయటకు వచ్చింది. ఆ కుర్రాడు ఆ అమ్మాయితో చదువుకున్నవాడే. ఆ రోజుల్లో చనువుండేది. ఇప్పుడు ఆ అమ్మాయికి పెళ్లి నిశ్చయం కావడంతో ఆ అబ్బాయి తీరు విపరీతమైంది.

పెళ్లి చేసుకుంటానని లోబరుచుకుని..

మండపేట పట్టణంలోని గొల్లపుంత కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ క్రాంతికుమార్ అదే పట్టణంలో పదవ తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారం చేశాడు. ఇతడికి ఇంతకుముందే వివాహమై కుమారుడు కూడా ఉన్నారు. నిందితుడి ఇంటికి సమీపంలోనే ఆ బాలిక కుటుంబం ఉండడంతో పరిచయం పెంచుకుని అఘాయిత్యానికి పాల్పడ్డారు. పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో లోబరుచుకున్నట్టు తేలింది.

సోషల్ మీడియా ఓ కత్తి..

సోషల్ మీడియా ఓ కత్తి వంటిది. దానితో మంచి చెడూ రెండూ ఉన్నాయి. అయితే చెడు మార్గంలోకి వెళ్లడానికి ఈరోజు యువత దానిని ఎక్కువగా వాడుతోంది. చెడు కంటెంట్ కూడా విపరీతమైన లభ్యత వల్ల బాలలు సైతం కొన్ని కేసుల్లో ఉండడం మనం చూస్తున్నాం. పిల్లల సెల్‌ఫోన్లను పెద్దలు గమనిస్తూ ఉండాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలతో స్నేహభావంతో మెలుగుతూ అన్ని విషయాలనూ గమనిస్తూ, ఆరా తీస్తూ ఉండాలి. ఆదర్శనీయులు, మార్గదర్శకులు, నీతి కథలు, జీవితంపై చెడు చూపించే ప్రభావం, కుటుంబ విలువలు వంటి వాటిని నూరిపోస్తూ ఉంటే మంచిది.

- డాక్టర్ కర్రి రామారెడ్డి, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు

ఆత్మరక్షణపై శిక్షణ ఉండాలి

అత్యాచారాలు, అఘాయిత్యాల నుంచి తప్పించుకునేందుకు అవగాహనతోపాటు ఆత్మరక్షణపై పాఠశాలల్లో శిక్షణ ఇవ్వాలి. ప్రతీ ఒక్కరు బాలికలకే జాగ్రత్తలు చెబుతారుతప్ప బాలురకు కౌన్సెలింగ్‌గానీ, శిక్షణగానీ ఇవ్వడం లేదు.. బాలికలతో బాలురు ఎలా మెలగాలనేది కూడా కుటుంబ స్థాయిలోనే పెంపకంలోనే అలవాటు చేయాలి. వీటికి తల్లే ముఖ్య బోధకురాలు కావాలి. బాల్య దశలోనే నీతి సూత్రాలు, మంచి కథలు వినిపించాలి.

- నల్లి సన్‌షైన్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్



జిల్లా పర్యాటక కమిటీ మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి. చిత్రంలో డీఆర్వో, ఫారెస్ట్ అధికారి, ఏజెన్సీల ప్రతినిధులు

హైవేలో నర్సరీ స్టాల్స్‌కు ఆసక్తి చూపేవారిని గుర్తించాలి

ఆగస్టుకి జిల్లాలో ప్రతిపాదిత టూరిజం పనులన్నీ కార్యరూపం దాల్చాలి

జిల్లా పర్యాటక కమిటీ సమావేశంలో కలెక్టర్ పి. ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో నర్సరీల స్టాల్స్ ఏర్పాటుచేస్తే బాగుంటుంది. వాటి నిర్వహణ పట్ల ఆసక్తి ఉన్నవారిని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధంచేయాలి. కడియం నర్సరీలు, ఫ్లవర్ మార్కెట్, స్వయం సహాయక సంఘాలు, చేనేత కుటుంబాలను గుర్తించి లీజు విధానంలో స్టాల్స్ ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికార్లను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు ఆఫీసులో తన అధ్యక్షతన బుధవారం జరిగిన జిల్లా పర్యాటక కమిటీ సమావేశంలో ఆమె ప్రతిపాదిత ప్రాజెక్టులను సమీక్షించి పలు సూచనలు చేశారు. ఆగస్టు నెలకు జిల్లాలో ఇప్పటివరకూ ప్రతిపాదించిన పర్యాటక ప్రాజెక్టు పనులన్నీ కార్యరూపం దాల్చాలన్నారు. వాటి అభివృద్ధికి వివిధ ఏజెన్సీలను గుర్తించి ప్రత్యేక ప్రతిపాదనలతో అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పొట్టిలంక నుంచి కడియపులంక వరకూ జాతీయ రహదారిలో నిర్దిష్ట పరిమాణంలో స్టాల్స్ ఏర్పాటుచేసి అక్కడ నీరు, విద్యుత్, సీసీ కెమేరాల వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కమిటీ మరో సమావేశంలో లీజు ధర నిర్ణయిస్తుందని, ఆసక్తి చూపించే వర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. వీటి స్వీకరణలో నర్సరీ అసోసియేషన్ అభ్యర్థించిన సమయం ఇవ్వాలని చెప్పారు. కడియపులంక ప్రాంతంలో కాలువలో ఒక కిలోమీటరు మేర బోటింగ్ సౌకర్యం ఏర్పాటుచేసి, దశలవారీగా నిడివి పెంచాలని, వేమగిరి నుంచి కడియపులంక వరకూ 10 సీట్ల డీలక్స్ బోట్లు ఏర్పాటు, శిల్పారామం సొసైటీ అభివృద్ధికి అనువైన భూమిని గుర్తించాలని కోరారు. కడియం నర్సరీలకు సంబంధించి కొత్త కమిటీ ఆధ్వర్యంలో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఆశాభావం వ్యక్తంచేశారు. హేవలాక్ వంతెన కోసం మార్పిడి ప్రక్రియ, టూరిజం, బడ్జెట్ హోటల్ అభివృద్ధి చేయడానికి, 5స్టార్ హోటల్ నిర్మాణానికి భూమిని గుర్తించాలని, బ్రిడ్జిలంక ద్వీపంలో టూరిజం అడ్వెంచర్ కార్యకలాపాలు, ఫ్లోటింగ్ రెస్టారెంట్ నిర్వహణ, ట్రీ హట్స్, గ్లాస్ హౌస్‌లతో కూడిన పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు. పుణ్యక్షేత్రం తదితర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి డీపీఆర్‌లు సిద్ధంచేయాలని ఆదేశించారు. నగరవనం తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, విడిది, సాహస క్రీడలు ఏర్పాటుచేయాలని సూచించారు. రంపచోడవరం పరిధిలో ఎకోటూరిజం ఆధారిత ప్రాజెక్టులతో కూడిన వాటిని అడాప్ట్ చేసుకోవడానికి సాధ్యాసాధ్యాలు, ప్రతిపాదనలపై నగర పాలక సంస్థ కమిషనర్‌తో సమావేశం ఏర్పాటుచేసి సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఇవ్వాలని డీఎఫ్‌వో రవీంద్రను కోరారు. ఈ సమావేశంలో ఇంచార్జి జిల్లా ఫారెస్ట్ అధికారి రవీంద్ర దామా, డీఆర్వో టి.సీతారామమూర్తి, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి ఎ.దుర్గేష్, ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్, కడియం నర్సీల అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, ఆర్ఎంసీ అదనపు కమిషనర్ వీవీ రామలింగేశ్వర్, ఆర్ఎంసీ ఎస్ఈ జీ పాండురంగారావు, జిల్లా హార్టికల్చరల్ ఆఫీసర్ బి.సుజాత, ఎంపీడీవో, టూరిజం అధికారులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు ఈ-సైన్ తిప్పలు

వైసీపీ చేసిన పాపం.. ఇప్పటికీ శాపమే

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖను బుధవారం సాంకేతిక సమస్యలు వెంటాడాయి. ఉదయం 10.30 గంటలకు కార్యాలయం తెరిచిన దగ్గర నుంచీ సబ్ రిజిస్ట్రార్లు తలపట్టుకున్నారు. రిజిస్ట్రేషన్లకు ఈ-సైన్ తప్పనిసరి. డిజిటల్ విధానంలో కక్షిదారుల సంతకాలు పూర్తయిన తర్వాత చివరిగా సబ్‌రిజిస్ట్రార్ సంతకంతో ప్రక్రియ ముగుస్తుంది. అయితే ఈ-సైన్ ఉదయం నుంచీ సమస్యగా మారింది. సాధారణంగా 5-10 నిమిషాల్లో మొత్తం పూర్తయ్యే ఈసైన్‌లో.. ఒక్కో సంతకానికి 30 నిమిషాలకుపైగా సమయం పట్టింది. కొన్ని సందర్భాల్లో గంట దాటిపోయింది. మధ్యాహ్నం 3గంటల తర్వాత మెరుగుపరిచినట్టు ప్రధాన కార్యాలయం నుంచి సమాచారం అందినా వాస్తవంగా మాత్రం ఇబ్బంది తప్పలేదు. దీంతో జిల్లాలోని 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్లు నత్తనడకన సాగాయి. కొందరు కక్షిదారులు మరుసటిరోజుకు వాయిదా వేసుకొని వెళ్లిపోయారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వాళ్లు వేచిచూడక తప్పలేదు. రైలు, బస్సు రిజర్వేషన్లు చేయించుకున్న వాళ్లు నష్టపోయారు. రాత్రి 7గంటల తర్వాత కూడా కొందరు సబ్ రిజిస్ట్రార్లు ఈ-సైన్ కరుణ కోసం వేచి చూస్తునే ఉన్నారు. గతంలో సాంకేతిక ఇబ్బంది తలెత్తినా గరిష్ఠంగా గంటలో సరి చేయడం జరిగేది. ఇప్పుడు ఏకంగా రోజంతా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-సైన్ విధానం వల్ల తరచుగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని జనం మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం కార్డ్‌ప్రైం 2.0లో భాగంగా డిజిటల్ విధానంలో సంతకాలను తీసుకొచ్చింది. అలా చేసిన సంతకాలు మాత్రమే డాక్యుమెంట్‌లో ప్రింట్ అవుతాయి. వంద ఏళ్లకు పైబడి ఉన్న వేలి ముద్రల పుస్తకాన్ని కూడా ఆ తర్వాత రద్దుచేశారు. దీంతో డిజిటల్ విధానంలో సంతకం చేయడం మాత్రమే ఏకైక మార్గంగా మారింది. ఒకవేళ న్యాయపరంగా చిక్కులు వచ్చిన సందర్భంలో ఫిజికల్‌గా సంతకాన్ని నిరూపించడానికి ఎలాంటి రిజిస్టరూ లేకుండా చేసేశారు. దీనిపై అప్పట్లోనే పెద్దఎత్తున విమర్శలు వచ్చినా జగన్ పట్టించుకోలేదు. కేవలం డిజిటల్ విధానాన్నే నమ్ముకోవడం వల్ల పెద్దగా ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తి సంతకాలు, డాక్యుమెంట్ల వివరాలు తారుమారైతే రుజువు చేసుకోడానికి రెండో ఆధారం అంటూ ఏదీ లేకుండా పోయింది. కార్డ్‌ప్రైమ్ రాకకు ముందు సంతకాల నిర్ధారణ కోసం వేలి ముద్రల పుస్తకం (టీఐఆర్) ఉపయోగపడేది. ఏదేమైనా జగన్ జమానాలో ఇష్టానుసారం తీసుకున్న నిర్ణయాల వల్ల జనం ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారని ఇది రుజువు చేస్తోంది.

ఉద్యోగ విరమణ చేసిన తొలి నెలలోనే పెన్షన్ లక్ష్యం

- రాష్ట్ర ప్రిన్సిపల్ అక్కౌంటెంట్ జనరల్ శాంతిప్రియ
- కలెక్టర్ అధ్యక్షతన పెన్షన్ అదాలత్ అవగాహన సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి ప్రతి ఒక్కరూ ఉద్యోగ విరమణ చేసిన తొలి నెలలోనే పెన్షన్ పొందడం తమ లక్ష్యమని, దీనికోసం ప్రతి ఉద్యోగి ఉద్యోగ విరమణ తేదీకి ముందే సంబంధిత డ్రాయింగ్ అండ్ పంపిణీ అధికారులకు పెన్షన్ పత్రాలను సమర్పించాలని రాష్ట్ర ప్రిన్సిపల్ అక్కౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ అన్నారు. పెన్షన్ అదాలత్, జీపీఎఫ్ అదాలత్ ఫలవంతమైన దిశగా నిర్వహించుకోవడం మంచి పరిణామం అని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాలులో తూర్పుగోదావరి జిల్లా పెన్షన్ అదాలత్, జీపీఎఫ్ అదాలత్, ఇతర అనుబంధ సమస్యల పరిష్కారం కోసం ఒక రోజు అవగాహన పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన సర్వీస్ సమయంలో సర్వీస్‌కు సంబంధించిన అన్ని అంశాలు సర్వీస్ రిజిస్టర్‌లో నమోదయ్యేవిధంగా చూసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ అక్కౌంటెంట్ జనరల్ శాంతిప్రియ మాట్లాడుతూ ఉద్యోగులు ఉద్యోగ విరమణ తేదీకి ముందే పెన్షన్ పత్రాలను అందచేయడం వల్ల ఆ ఉద్యోగి ఉద్యోగ విరమణ చేసిన మొదటి నెలలోనే పెన్షన్ పొందుతారన్నారు. సీనియర్ డిప్యూటీ అక్కౌటెంట్ జనరల్ పోలు కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ పదవీవిరమణ చేయడానికి ఆరు నెలల ముందే పెన్షన్ పత్రాలు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ ఎన్.మోహనరావు, డిప్యూటీ అక్కౌంటెంట్ జనరల్ లలిత్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా, ఈ సందర్భంగా పలువురు తమ పెన్షన్ మంజూరు పత్రాలను కలెక్టర్ ప్రశాంతి, ప్రిన్సిపల్ అక్కౌంటెంట్ జనరల్ శాంతిప్రియకు అందజేశారు. పలువురు పెన్షనర్లు, అధికారులు, ఉద్యోగులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



పిస్టల్‌తో గురి చూస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

పోలీసు అధికారుల ఫైరింగ్ ప్రాక్టీస్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వార్షిక డీమొబిలైజేషన్‌లో భాగంగా ఎస్ఐ నుంచి ఆపై స్థాయి అధికారులకు పెద్దాపురంలోని పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఎస్పీ నరసింహ కిషోర్ స్వయంగా హాజరై పర్యవేక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎంబీఎం మురళీకృష్ణ, ఎల్.అర్జున్, ఎల్.చెంచిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌బీడబ్ల్యులపై దృష్టిపెట్టండి.. మిస్సింగ్ కేసుల్లో వేగం పెంచాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పెండింగ్ ఎన్‌బీడబ్ల్యులు, బైండోవర్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ కేసుల్లో దర్యాప్తు వేగం పెంచాలన్నారు. దర్యాప్తులో ఉన్న అన్ని కేసుల్లోనూ త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. గ్రేవ్ ఎక్విటల్, పోక్సో, ఎస్సీ ఎస్టీ కేసుల పరిస్థితిపై ఆరా తీసిన ఎస్పీ.. పలు సూచనలు చేశారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని ఆదేశించారు. పెట్టీ కేసుల సంఖ్యను పెంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఎల్.అర్జున్, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో గంగా నదికి నమస్కరిస్తున్న ఎంపీ పురందేశ్వరి

త్రివేణి సంగమంలో ఎంపీ పురందేశ్వరి పుణ్యస్నానం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా సందర్భంగా బుధవారం రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో పవిత్ర పుణ్యస్నానం ఆచరించారు. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడుదల చేస్తూ దేశంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని ఈ సందర్భంగా గంగాదేవిని వేడుకున్నానని తెలిపారు. ఇదే స్ఫూర్తితో మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు మనందరం కంకణబద్ధులు కావాలని పురందేశ్వరి కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

కాగా కూటమి తరపున ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న పేరాబత్తుల రాజశేఖరాన్ని ఎన్నికల్లో గెలిపించాలని ఎంపీ పురందేశ్వరి కోరారు. ఈ మేరకు ఓ వీడియో సందేశాన్ని విడుదల చేస్తూ ఈనెల 27న జరిగే ఎన్నికల్లో రాజశేఖరానికి తొలి ప్రాధాన్య ఓటు వేయాలని కూటమి తరపున, బీజేపీ తరపున కోరుతున్నట్టు ఆమె పేర్కొన్నారు.



ఏర్పాట్లు చాలా బాగున్నాయి

యోగేష్ పరబ్, స్టేట్ స్పోర్ట్స్ ఆర్గనైజర్, గోవా

ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్స్‌కి చాలా రాష్ట్రాలకు వెళ్లాను. కానీ కాకినాడలో క్రీడాకారుల పట్ల చూపిన అభిమానం ఎక్కడా చూడలేదు. బస చేసేందుకు హోటల్ రూమ్స్, వెళ్లి, వచ్చేందుకు ట్రావెలింగ్, భోజన ఏర్పాట్లు అన్నీ బాగున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన మైదానం ఆటకు ఎంతో అనుకూలంగా ఉంది.



ఆస్ట్రో టర్ఫ్ గ్రౌండ్‌లో ఆడాలన్న కల నెరవేరింది

బి.సురేష్‌రాజు, ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్

ప్రతి హాకీ క్రీడాకారుడికి ఆస్ట్రో టర్ఫ్ గ్రౌండ్‌లో ఆడడం ఒక కల. ఆ కల కాకినాడలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో నెరవేరింది. ఈ గ్రౌండ్‌లో ఆటను ఆస్వాదిస్తూ ఆడొచ్చు. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గోవాపై టీమ్ స్పిరిట్‌తో గెలిచాం. ఆ గెలుపు మా జట్టుకు మరింత స్ఫూర్తినిచ్చింది.



అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు

మారేశ్వరన్, సీబీడీటీ టీమ్, తమిళనాడు

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలున్న మైదానంలో ఆడడం చాలా బాగుంది. బ్లూ టర్ఫ్ గ్రౌండ్ చాలా స్పీడ్‌గా ఉంది. ఆటను ఆస్వాదించగలుగుతున్నాం. 2022లో ఆసియా క్రీడల్లో బ్రాంజ్ మెడల్ సాధించాము. జూనియర్స్, సీనియర్స్‌లో ఇండియా తరపున ఎన్నో మ్యాచ్‌లు ఆడాను.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి)



పురుషుల విభాగంలో చండీఘర్, బెంగళూరు మధ్య హోరాహోరీగా జరుగుతున్న మ్యాచ్

హాకీ క్రీడోత్సాహం

కాకినాడలో ఐదో రోజుకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు




గోల్ చేయడానికి రెడీ

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లకు సంబంధించి మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు జరిగాయి. ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్, హైడ్రాలజీ శాస్త్రవేత్త సత్యాజీరావు, డీఎస్డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్, రాజస్థాన్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్ 7-1 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ భువనేశ్వర్, ఆర్ఎస్బీ ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ ఉత్తరాఖండ్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ చండీఘర్, ఆర్ఎస్బీ బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ బెంగళూరు 4-1 తేడాతో గెలుపొందింది. తెలంగాణ సెక్రటేరియట్, గోవా సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ సెక్రటేరియట్ 21-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, ఆర్ఎస్బీ అహ్మదాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 3-0 తేడాతో విజయం సాధించింది. మహిళల విభాగంలో... సెంట్రల్ సెక్రటేరియట్, రాజస్థాన్ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్, కేరళ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్ 13-0 తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 18-0 తేడాతో విజయం సాధించింది.



విజయం అనంతరం హాకీ స్టిక్‌ను ముద్దాడుతున్న క్రీడాకారిణి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్



మహిళల విభాగంలో కేరళ వర్సెస్ ఛత్తీస్‌గఢ్



ప్రమాణస్వీకారం అనంతరం ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గం

సేవా తత్పరులు ఆర్యవైశ్యులు

ఉభయ గోదావరి జిల్లాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి

అన్నవరంలో అట్టహాసంగా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం

అన్నవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం కాకినాడ జిల్లా అన్నవరంలోని ఒక ప్రైవేటు లాడ్జిలో బుధవారం జరిగింది. ముందుగా సంఘ సభ్యులు సత్యదేవుడిని దర్శించుకున్నారు. అనంతరం కొండ దిగువన గౌరవాధ్యక్షుడు ప్రగళ్లపాటి కనకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా కంచర్ల బాబి, కార్యదర్శిగా కుసుమంచి పాపారావు, కోశాధికారిగా కంచర్ల కృష్ణమోహన్, సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం ఆశీస్సులతో ఏర్పడిన ఈ కమిటీ అంతా పేద వైశ్యుల సంక్షేమానికి పాటుపడడమే కాకుండా వాణిజ్యపరంగా ఎవరికి ఏ ఇబ్బంది కలిగినా ముందుండాలన్నారు. అధ్యక్షుడు కంచర్ల బాబి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన పదవికి న్యాయం చేకూరుస్తానన్నారు. అందరి కష్టాల్లో పాలుపంచుకోవడమే కాకుండా ఆర్యవైశ్యులు అంటే సేవాతత్పరులు అనే భావనకు మరింత వన్నె తెస్తానన్నారు. జోనల్ చైర్మన్ బత్తుల నానాజీ, మండవల్లి వెంకన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, దాసరి శ్రీనివాస్, జయవరపు విహారి, దాసరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు మండలం పాదురుపాకలో పార్వతి ఇంటి ఆవరణలో పెళ్లి పందిరి

కీర్తిశేషులకు పెళ్లి

పాండవులపాలెం పంచాయతీ పాదురుపాకలో వెలుగుచూసిన ఘటన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మరణించిన 20 ఏళ్ల తర్వాత ఓ జంటకు పెళ్లి జరిగింది. ఆశ్చర్యపోతున్నారా! మీరు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. మరణించిన తర్వాత వారి తల్లిదండ్రుల వివాహం జరిపించేందుకు వారి కుటుంబీకులు సిద్ధమైన అరుదైన ఈ సంఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పాండవులపాలెం గ్రామ పంచాయతీ పాదురుపాకలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పాదురుపాకకు చెందిన సోమాల బాబూరావు-భూలక్ష్మి దంపతుల కుమార్తె పార్వతి వివాహ వయసు వచ్చిన తర్వాత (ఇరవై ఏళ్ల కిందట) చనిపోయింది. అదే గ్రామానికి చెందిన ఇరక నూకరత్నం కుమారుడు రాంబాబు 15 ఏళ్ల క్రితం చనిపోయాడు. వీరిలో పార్వతి రాంబాబును ఇష్టపడి జీవించిన కాలంలో పెళ్లి చేసుకోవాలనుకునేది. వివాహం జరగకుండానే పార్వతి మృతి చెందింది. ఆ తర్వాత రాంబాబు కూడా మృతి చెందాడు. ఇటీవల పార్వతి తన కుటుంబ సభ్యుల కలలోకి వచ్చి తమకు పెళ్లి చేయాలని కోరింది. దీంతో ఇరు కుటుంబాల వారు మరణించిన పార్వతి, రాంబాబులకు హిందూ సంప్రదాయ పద్ధతిలో పెళ్లి పందిరి వేసి బుధవారం వివాహం జరిపించారు. గ్రామస్థులకు విందు భోజనాలు కూడా పెట్టారు. ఇది ఆనోటా, ఈనోటా బయటకొచ్చింది.



రజత కవచాలను సమర్పిస్తున్న భరత్‌కుమార్, సింధూర

రమా సత్యనారాయణస్వామికి 5.700 కిలోల వెండి కవచం సమర్పణ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న రమా సత్యవతీ సమేత సత్యనారాయణస్వామికి బుధవారం యానాంకు చెందిన కర్రి సుబ్బిరెడ్డి-హైమావతి దంపతుల కుమారుడు భరత్‌కుమార్-సింధూర దంపతులు 5.700 కిలోలతో రజత కవచం చేయించారు. బుధవారం దానిని ఆలయ సహాయ కమిషనరు, ఈవో అల్లు వెంకట దుర్గాభవానీకి సమర్పించారు. వెండి కవచాలకు దేవులపల్లి ఫణిరామకృష్ణ సంప్రోక్షణ చేయించారు. అనంతరం అర్చకుడు కొంతేటి శ్రీనివాస భీమశంకరం స్వామి, అమ్మవార్లకు అలంకరించారు.



రజత కవచాలంకరణలో స్వామి, అమ్మవార్లు

ఆర్ట్స్ కళాశాలలో నేటి నుంచి ఉద్భవ్ యూత్ ఫెస్టివల్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్-2025 పేరుతో ఈ నెల 20, 21, 22 తేదీల్లో నేషనల్ యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ రామచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఆఫ్‌లైన్ ఈవెంట్స్‌లో భాగంగా క్లాసికల్ డ్యాన్స్, పేట్రియాటిక్ డ్యాన్స్, లైట్ మ్యూజిక్, ఫోక్, ట్రైబల్ డ్యాన్స్, ఫిల్మ్ డ్యాన్స్ జరుగుతాయన్నారు. కళాశాలలోని ఓపెన్ ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని ప్రిన్సిపాల్ చెప్పారు.



గిరిజనుల పెద్ద పండుగ మన్యంకొండ జాతర

వచ్చే నెల 3న పొల్లూరు జలపాతం వద్ద నిర్వహణ

మోతుగూడెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల పెద్ద పండుగ మన్యంకొండ జాతర. దీనిని ఒడిశా ప్రభుత్వం ప్రతి రెండేళ్లకోసారి అధికారంగా నెల రోజులు నిర్వహిస్తుంది. అయితే మార్చి 3న అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని పొల్లూరు జలపాతం వద్ద ఒక రోజు జాతర జరుపుతారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా మన్యంకొండ గ్రామంలో ఉన్న గిరిజన వనదేవతలు కన్నమరాజు (శ్రీకృష్ణుడు), బాలరాజు (అర్జునుడు), పోతురాజు (భీముడు), ముత్యాలమ్మ తల్లి ఘటం ధ్వజాల రూపంలో పూజలు అందుకుంటాయి. వీటికి ప్రతి రెండేళ్లకోసారి ప్రాణ ప్రతిష్ఠ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని మోతుగూడెం వద్ద ఉన్న పొల్లూరు జలపాతం వద్ద నిర్వహించడం ఆచారంగా వస్తోంది..

మోతుగూడెంలో మన్యంకొండ జాతరను తిలకించడానికి వేరే రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో గిరిజనులు తరలివస్తారు. ఫిబ్రవరి 11న మొదలైన జాతర మార్చి 12 వరకు కొనసాగుతుంది. పొల్లూరు జలపాతం వద్ద మార్చి 3న ప్రధానమైన మంగళస్నానం, ప్రాణ ప్రతిష్ఠ జరుగుతాయి. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి రూపం లేకుండా ఉన్న ముత్యాలమ్మ తల్లి ఘటం, ధ్వజం రూపంలో ఉన్న సోదరులు (కన్నమరాజు, బాలరాజు, పోతురాజు)తో కలిసి మన్యంకొండ చేరుకుంటుంది. అదే సమయంలో మోతు బ్లాక్‌లో ఉన్న నడవనపల్లి గ్రామంలో నుంచి గద్వాల కోసం కొత్త వెదురులను తీసుకుని పూజారులు మన్యం కొండ వస్తారు. కొండ గృహాలు ఉన్న మూల రూపాలకు ప్రత్యేక పూజలు చేసి బోయ యాత్రకు బయల్దేరతారు. ఈ యాత్రలో వేలాదిగా గిరిజన భక్తులు కాళ్లకు చెప్పులు లేకుండా కొండకోనలు ఎక్కుతూ వాగులు, వంకలు దాటుతూ వన దేవతతో పాటు నడక సాగిస్తారు.

సంప్రదాయంగా మేళతాళాలు, థింసా నృత్యంతో సీలేరు నది ఆనుకుని ఉన్న ఒడిశాలోని అవతల పొల్లూరుకు మార్చి 2న జాతర చేరుకుంటుంది. మార్చి 3 ఉదయం పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత కొత్తగా తయారు చేసిన ప్రత్యేక పడవలపై వన దేవతలను నది దాటించి ఆంధ్రాలోని పొల్లూరు జలపాతం వద్దకు తీసుకొస్తారు. అక్కడ వనదేవతలకు మంగళస్నానం చేయించి పాత ధ్వజాలను నిర్వీర్యం చేసి కొత్త ధ్వజాలకు ప్రాణ ప్రతిష్ఠ చేసి భక్తులు దర్శించుకునేందుకు జలపాతం వద్ద ఉంచుతారు. అనంతరం బలి పూజ చేసుకుంటారు. తిరిగి ప్రయాణమై మన్యంకొండకు చేరుకుంటారు. ఈ జాతరను వీక్షించడానికి సుమారు 20వేల మంది భక్తులు తరలివస్తారు.

పొల్లూరు వద్దకు చేరుకున్న తర్వాత వన దేవతలకు జలపాతం చెంతన ఉన్న గృహంలో ప్రత్యేక పూజలు చేస్తారు. పూజలకు సంతృప్తి చెందిన ముత్యాలమ్మను జలపాతంలో బంగారు చేప రూపంలో పూజరులు భక్తులకు దర్శనం చేయిస్తారని నమ్మకం. వన దేవతలతో పాటు జలపాతంలో పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు పోటీపడతారు. అనంతరం జలపాతం వద్ద ఉంచిన ఆసనంపై అలంకరించిన వన దేవతలను భక్తులు దర్శించుకుంటారు.

వయసు నూరేళ్లు... ఖరీదు 35 లక్షలు

● కడియం నర్సరీలో వింతైన రూపంతో ఆకర్షిస్తున్న విదేశీ చెట్టు

కడియం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం నర్సరీలకు ఇప్పటివరకు అనేక రకాల విదేశీ మొక్కలు దిగుమతి అయ్యాయి. అవి ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు కూడా తీసుకొచ్చాయి. తాజాగా కడియపులంక శివాంజనేయ నర్సరీ రైతు మల్లు పోలరాజు కొద్ది రోజుల క్రితం వింత ఆకారాలతో తీసుకొచ్చిన చెట్లు ఆకట్టుకుంటున్నాయి. దక్షిణ అమెరికాలో విరివిగా ఉండే వీటిని స్పెయిన్, థాయిలాండ్ వంటి దేశాల్లో విక్రయిస్తున్నారు. పెద్ద పార్కులు, హోటళ్లు, గార్డెన్స్‌ల్లో ప్రత్యేక అలంకరణగా వీటిని పెంచుతారు. వయసు 100 నుంచి 120 ఏళ్లు ఉంటుంది. ఒక్కో చెట్టు ఖరీదు రూ.35 నుంచి రూ.40 లక్షలు ఉంటుంది. ఈ చెట్లను భారీ కంటైనర్లలో తీసుకొచ్చారు. ప్రస్తుతం మోడుగా ఉన్న వీటికి కొమ్మలు వచ్చి రంగురంగుల పూలు పూస్తాయని పోలరాజు తెలిపారు. 'సిల్క్ ఫ్లోస్' ట్రీ'గా పిలువబడే ఈ చెట్టు శాస్త్రీయ నామం 'కొరిసియా స్పెసియోసా'. ఇవి కడియం నర్సరీలతో పాటు హైదరాబాద్ సమీపంలోని 150 ఎకరాల పార్కులో ఉన్నాయి.



జేఎన్టీయూకే నూతన వీసీ బాధ్యతల స్వీకరణ



వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న సీఎస్ ఆర్కే ప్రసాద్

● ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్‌కు అభినందనలు తెలిపిన వర్సిటీ అధికారులు, తదితరులు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఉపకులపతిగా నియామకమైన ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ బుధవారం మధ్యాహ్నం వీసీ ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వర్సిటీ అధికారులు, మాజీ ఉపకులపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం వీసీ సమావేశపు హాల్లో రిజిస్ట్రార్, ఓఎస్డీ, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తనను వీసీగా నియమించినందుకు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. జేఎన్టీయూకే విశ్వవిద్యాలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని ఆపేరు ప్రఖ్యాతులను కాపాడుకుంటూ మరింత ఉన్నతస్థానానికి చేరుకునేలా అందరూ కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. పూర్వ విద్యార్థులు యూనివర్శిటీ అభివృద్ధికి తమవంతు సహకారమందించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని 2047లో అభివృద్ధిపథంలో పయనింపజేసేలా చేపడుతున్న వికసిత్ భారత్, సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమైన స్వర్ణాంధ్రప్రదేశ్-2047 సాధనకు కృషిచేస్తూ వర్శిటీ అభివృద్ధికి సంబంధించిన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలన్నారు. జేఎన్టీయూకే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో టాప్ 100లో ఉండేలాగా, మెరుగైన ఎన్‌బీఏ ర్యాంకింగ్ సాధనకు కృషిచేద్దామన్నారు. అధ్యాపకులు ముఖ్యంగా పరిశోధనలకు ప్రాధాన్యతను ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, అప్పుడే నాణ్యత కలిగిన పరిశోధనలు చేపట్టవచ్చని తెలిపారు. విద్యార్థులను స్టార్టప్స్, ఆవిష్కరణలు పట్ల ఆసక్తి చూపేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించడంతో పాటు ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న మార్పులకనుగుణంగా బోధన ఉండేలా ప్రణాళిక చేపట్టడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు డైరెక్టర్లు సాయిబాబు, రవీంద్ర, కృష్ణ, గోపాలకృష్ణ, బాలకృష్ణ, పద్మజారాణి, వెంకట రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణప్రసాద్, కుమారస్వామి ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు బాధ్యతలు స్వీకరించనున్న నన్నయ వర్సిటీ వీసీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నూతన ఉప కులపతిగా ప్రభుత్వం నియమించిన ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో ప్రస్తుతం ఆంగ్లశాఖ ఆచార్యులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం 11 గంటలకు ఉద్యోగ బాధ్యతలు చేపడతారు. ఈ సమాచారం అందుకున్న ఇక్కడి వర్సిటీ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. వర్సిటీ అధికారులు, తదితరులు పాల్గొంటారు.

పౌల్ట్రీ పరిశ్రమ సమస్యలపై సీఎంకి వినతి



చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటసుబ్బారావు, తదితరులు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీలో బర్డ్‌ఫ్లూ వల్ల పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర నష్టాలను ఎదుర్కొంటుండడంతో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేసినట్టు రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు, కాల్ధరి గ్రామానికి చెందిన పౌల్ట్రీ యజమాని కోమట్లపల్లి వెంకటసుబ్బారావు బుధవారం విలేకరులకు తెలిపారు. బర్డ్ ఫ్లూ వల్ల పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని, వేలాది కోళ్లు, లక్షలాది గుడ్లు కొనుగోలు లేక పాడైపోయి నష్టాలను చవిచూస్తున్నట్టు సీఎంకి వివరించామన్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్టు వెంకటసుబ్బారావు చెప్పారు. అలాగే మంత్రి అచ్చెన్నాయుడును కలిశామన్నారు. ఈయనతోపాటు ఫెడరేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

మాయమాటలు చెప్పి... మహిళలను మోసగించి

● ఇద్దరిపై కేసు నమోదు

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మాయమాటలు చెప్పి మహిళలను మోసగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కే. శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి... రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరుకు చెందిన బొజ్జా సింధూ, ఆమె బంధువు దుద్దుకూరుకి చెందిన మరో మహిళను ఫైనాన్స్ కంపెనీలో ఇంటిపై రుణం ఇప్పిస్తానని చెప్పి నమ్మించారు. దీంతో కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కడిమి శ్రీనుబాబు, మెరిపో కృష్ణ దఫదఫాలుగా రూ. 3,45,000 తీసుకున్నారు. ఈ నెల 13వ తేదీన సింధూ తన భర్తతో కలిసి ధర్మవరం వెళ్లి అడగ్గా, ఆ ఇద్దరు వ్యక్తులు దురుసుగా మాట్లాడి, కొట్టి చంపుతానని బెదిరించారు. దీనిపై కొవ్వూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గోదాట్లో దూకేశాడా?

● యువకుడి అదృశ్యం .. ఆందోళనలో కుటుంబ సభ్యులు
● రోడ్డు కం రైలు వంతెనపై కనిపించిన సాయితేజ బైక్
● నదిలో గాలిస్తున్న బంధువులు



గగ్గురోతు సాయితేజ

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మండలం దొమ్మేరుకి చెందిన గగ్గురోతు సాయితేజ (25) కనిపించడం లేదని కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. సాయితేజ రాజమహేంద్రవరంలో ఓ గేదెల ఫాంలో పనిచేస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగా నే బుధవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జిపై మోటారు సైకిల్‌ను గుర్తించారు. సాయితేజ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటం, ఆచూకీ లభించకపోవడంతో గోదావరి నదిలో జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ మేరకు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి వరకు ఆచూకీ తెలియరాలేదు. మోటారుసైకిల్ బ్రిడ్జిపై పెట్టి ఎక్కడికైనా వెళ్లి ఉంటాడా, లేదా గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే సందేహం వ్యక్తమవుతోంది. అదృశ్యమైన యువకుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి కేసు నమోదు చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

రాజానగరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరంలోని 2వ అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు తీర్పు వెలువరించారు. రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021 సంవత్సరంలో నమోదైన ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందరాడ గ్రామానికి చెందిన దువ్వాటి సామ్యూల్‌రాజును చప్పిడి శివకాశి చాకుతో గాయపర్చి హత్యాయత్నం చేయడంపై అప్పటి ఎస్.ఐ శివనాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దాదాపు నాలుగేళ్ల తర్వాత కోర్టులో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో సామ్యూల్‌రాజుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ జడ్జి కె.ప్రకాష్‌బాబు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ పీవీ వీఎస్‌బీ రాజు వాదించగా, సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్స్ దుర్గాప్రసాద్, వెంకటరమణ సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టారన్నారు.

గామన్‌బ్రిడ్జిపై కారు దగ్ధం

● ఏసీలో తలెత్తిన షార్ట్‌సర్క్యూటే కారణం ● మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



బ్రిడ్జిపై కాలిపోతున్న కారు (ఇన్‌సెట్లో), మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏసీ కంప్రెషర్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా కారు నుంచి మంటలు చెలరేగాయి. ఈ సంఘటన కొవ్వూరు గామన్‌బ్రిడ్జిపై బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గోపాలపురం మండలం వాదాలకుంటకి చెందిన బందెల కృష్ణారావు తన ఇండిగో కారులో సీతానగరం వెళ్తున్నాడు. మార్గమధ్యలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి 33వ స్తంభం వద్దకు వచ్చేసరికి కారు నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో అందులో ఉన్నవారంతా దిగి బయటకు వచ్చేశారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి ఫైర్‌అధికారి ఎస్. సీతారామయ్య తన సిబ్బందితో వచ్చి మంటలను అదుపుచేశారు. కారు పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ. లక్ష ఆస్తినష్టం సంభవించిందన్నారు. ఈ ఘటనతో గామన్‌బ్రిడ్జిపై దొమ్మేరు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే రోడ్డులో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. లీడింగ్ ఫైర్‌మేన్ పి. అప్పారావు, డ్రైవర్ ఆపరేటర్ బి. పోసియ్య, ఫైర్‌మ్యాన్‌లు ఎం. రవికుమార్, కె.ధనుంజయ, హోంగార్డులు ఎం. శ్రీను, డేవిడ్‌రాజు, పోలీసు కానిస్టేబుల్ రాంబాబు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది వచ్చారు.

కోరంగి ఎకో 'మాస్టర్ ప్లాన్'కి సలహాలివ్వండి

● కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
● అటవీ, రెవెన్యూ, మత్స్య, తదితర శాఖల అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కోరంగి వైల్డ్ అభయారణ్యం ఎకో సెన్సిటివ్ జోనల్ మాస్టర్‌ప్లాన్ తయారీకి సంబంధిత అధికారులు సూచనలు, సలహాలు అందించాలని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రనాథ్ రెడ్డితో కలిసి కోరంగి వైల్డ్‌లైఫ్ అభయారణ్యం జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీపై అటవీ, రెవెన్యూ, మత్స్య,ఉద్యాన, తదితర శాఖల అధికారులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభయా రణ్యం బయట ఉన్న సరిహద్దు నుంచి వివిధ ప్రదేశాల్లో 26 కిలోమీటర్ల దూరం వరకు ఎకో- సెన్సిటివ్ జోన్ ఉంటుందన్నారు. ఈ జోన్ వల్ల వన్యప్రాణుల స్వేచ్ఛకు, మనుగడకు మరింత భద్రత ఏర్పడుతుందన్నారు. పర్యావరణ సమతుల్యత నెలకొని పచ్చదనం పెంపొందడంతో పాటు సేంద్రియ వ్యవసాయానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ జోన్ పరిధిలో వర్షపు నీటిని వివిధ పద్ధతుల్లో నిల్వ చేసుకుని జంతువులకు నీటిసమస్య లేకుండా చేయవచ్చునన్నారు. ఈ నేపథ్యంలో తిరువనంతపురం సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్, డెవలప్‌మెంట్ వారు ఎకో- సెన్సిటివ్ జోనల్ మాస్టర్‌ప్లాన్ తయారు చేయనున్నారన్నారు. తిరువనంతపురం సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్, డెవలప్ మెంట్ ప్రోగ్రాం డైరెక్టర్ వినోద్, హైదరాబాద్ సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ డెవలప్‌మెంట్ రీజినల్ డైరెక్టర్ జయచంద్ర, పశుసంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాశరావు, మత్స్యశాఖ అధికారి కరుణాకర్ బాబు, గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ, కాకినాడ అటవీ అధికారి శ్రీదీప్తి, కోరంగి వైల్డ్‌లైఫ్ అటవీ అధికారి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బాలికను మాయచేసి ఆమెపై అత్యాచారంచేసిన కేసులో నిందితుడిని బుధవారం అరెస్టు చేసినట్టు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. అనాతవరం గ్రామానికి చెందిన వివాహితుడు పరమట దుర్గాప్రసాద్ (బులిచంటి)(30) ఓ పాఠశాలలో చదువుతున్న బాలికను సోమవారం బలవంతంగా మోటారు సైకిల్ ఎక్కించుకుని అమలాపురం తీసుకువెళ్లి ఎర్రవంతెన సమీపంలో ఉన్న ఓ నివాస గృహంలో ఆమెపై అత్యాచారం చేశాడు. బాలిక పాఠశాలకు హాజరుకాకపోవడం, ఆ బాలిక కూడా ఉన్న విద్యార్థినులు మోటారుసైకిల్‌పై వ్యక్తి బలవంతంగా తీసుకువెళ్లినట్టు పాఠశాల హెచ్ఎంకు తెలపడంతో హెచ్ఎం ఆ విషయాన్ని బాలిక తండ్రికి ఫోన్‌చేసి తెలిపారు. దీంతో ఆ బాలిక తండ్రి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆ విషయం దుర్గాప్రసాద్‌కు తెలియడంతో ఆ బాలికను అమలాపురంలో బస్‌చార్జీలకు డబ్బులిచ్చి బస్ ఎక్కించి పంపించి వేశాడు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే పర్యవేక్షణలో ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్‌లు కేసు నమోదుచేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి పంపించారు. నిందితుడిపై పోక్సో అత్యాచారం కేసులు నమోదుచేసి ముమ్మిడివరం జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టుకు తరలించగా మేజిస్ట్రేట్ రహ్మతుల్లా నిందితుడికి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

గొల్లప్రోలులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

● రూ.3.60లక్షలు విలువైన ఎరువులు సీజ్

గొల్లప్రోలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు చెందిన పట్టణంలోని మన గ్రోమోర్ రిటైల్ సెంటర్‌లో విజిలెన్స్ ఎస్పీ స్నేహిత ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. 14-35-14 రకం కాంప్లెక్స్ ఎరువు 200 బస్తాలకు సంబంధించి ఇన్వాయిస్‌లు లేకపోవడం, రైతులు ఫిర్యాదు చేసేందుకు కంప్లయింట్ బుక్ లేకపోవడం, స్టాక్ బోర్డు మెయింటెయిన్ చేయకపోవడంతో 6(ఏ) కేసు నమోదు చేశారు. రూ.3.60లక్షలు విలువయిన కాంప్లెక్సు ఎరువులను సీజ్ చేశారు. దాడుల్లో విజిలెన్స్ డీఎస్పీ తాతారావు, సీఐ నాగవెంకటరాజు, ఏవో మధుమోహన్, తూనికలు, కొలతలు శాఖ అధికారి సరోజిని, గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తునిలో దొంగల బీభత్సం

● ఎనిమిది షాపుల్లో చోరీ
● షట్టర్లు పగులగొట్టి దుండగుల దోపిడీ





చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు, షాపు తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడుతుండగా రికార్డు అయిన దృశ్యం

తునిరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో దొంగలు బీభత్సం సృష్టించారు. తుని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా మారడంతో, పోలీసులు కట్టుదిట్టమైన భద్రతాఏర్పాట్లలో తలమునకలవ్వగా సందట్లో సడేమియా అన్న చందాన దోపిడీ దొంగలు దొరికినకాడికి దోచుకుపోయారు. తాజాగా తునిలో జరిగిన చోరీతో పట్టణవాసులు ఉలిక్కిపాటుకు గురయ్యారు. బుధవారం తెల్లవారుజామున 3నుంచి 4 గంటల ప్రాంతంలో పట్టణశివారు రైల్వే అండర్ పాస్ సమీపంలో వరుసషాపుల్లో షట్టర్లు పగలగొట్టి దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. దొంగతనానికి గుంపుగా ప్రవేశించిన వీరు దర్జాగా చోరీకి పాల్పడుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలకి చిక్కాయి. ఈ వీడియోలు సోషల్‌మీడియా వేదికగా వైరల్ కావడంతో పోలీస్ పెట్రోలింగ్‌పై విమర్శలు తలెత్తుతున్నాయి. పట్టణంలో పోలీసింగ్ కట్టుదిట్టంగా లేకపోవడంతో ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయి. దొంగలను త్వరితగతిన పట్టుకుని ఇటువంటి ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని షాపుల యజమానులు కోరుతున్నారు. ఈ చోరీలో రెండు, మూడు షాపుల్లో నగదు భద్రపరుచుకునే సొరుగులు బద్దలగొట్టి నగదు చోరీ చేసినట్లుగా షాప్ యజమానులు వాపోతున్నారు. షాపు యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదులతో తుని పట్టణ పోలీసులు చోరీ జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌బాబు తెలిపారు.

మండపేట, మారేడుబాక దేవాలయాల్లో హుండీల చోరీ

మండపేట, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలో బుధవారం తెల్లవారుజామున దొంగలు రెచ్చిపోయారు. దేవాలయాల్లో హుండీలే లక్ష్యంగా ఎకకాలంలో మూడు దేవాలయాల్లో హుండీలను బద్దలు గొట్టి దోచుకుపోయారు. పట్టణంలో రథంగుడిసెంటరులోవున్న ఆంజనేయస్వామివారి భారీ విగ్రహం వద్దవున్న హుండీని దొంగలు బద్దలుగొట్టి అందులో వున్న నగదును దోచుకుపోయాడు. ఈ సంఘటన స్థానిక సీసీ పుటేజ్‌లో నమోదైంది. బుధవారం అర్ధరాత్రి రెండుగంటల సమయంలో చోరీ జరిగినట్టు నమోదైంది. ఈ చోరీ చేసిన వ్యక్తి మంకీ క్యాప్ ధరించి టూవీలర్‌పై వచ్చి చోరీకి పాల్పడినట్టుగా సీసీ పుటేజీలో నమోదైందని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. ఆ హుండీలలో రూ.20వేలకుపైగా నగదు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇదే అంశంపై ఆలయ నిర్వాహకులు పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదుచేశారు. పట్టణ సీ.ఐ డి.సురేష్ సంఘటనా స్థలానికి సిబ్బంది వచ్చి ఆరా తీశారు. మండలంలోని మారేడుబాకలో వున్న వినాయకుడుగుడి, రామాలయంలో దొంగ లుపడి హుండీల్లో నగదును దోచుకుపోయారని ఆలయాల నిర్వాహకులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకేరోజు మూడుచోట్ల వేర్వేరుగా చోరీలు జరగటం ప్రజల్లో ఆందోళన కలుగుతుంది. గంజాయికి అలవాటు పడిన వ్యక్తులే ఈతరహా చోరీలకు పాల్పడ వచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మండపేట ఆంజనేయస్వామి హుండీ చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న పట్టణ సీఐ సురేష్

మోటారు సైకిళ్ల డిక్కీలే లక్ష్యంగా..

● చోరీలకు పాల్పడుతున్న ముఠాలో వ్యక్తి అరెస్టు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిళ్ల డిక్కీలనే లక్ష్యంగా చేసుకుని నగదు దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాలో ఒక వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్టు డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. డిక్కీ ఉన్న మోటారుసైకిళ్లను లక్ష్యంగా చేసుకుని సంబంధిత యజమానులు తిరిగే ప్రాంతాల్లో రెక్కీలు నిర్వహిస్తూ చాకచక్యంగా పట్టపగలే డిక్కీలను తెరిచి చోరీలకు పాల్పడుతూ మోటారు సైకిళ్లపై ఇద్దరు వ్యక్తులు పరారవుతున్నట్టు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా గుర్తించినట్టు సీఐ తెలిపారు. ఈనెల 4న పేరూరు భారత్ పెట్రోలు బంకు సమీపంలో టిఫిన్ సెంటర్‌వద్ద మోటారు సైకిల్ పెట్టి అల్పాహారం చేసేందుకు వెళ్లారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలు డిక్కీని తెలిపి అందులో ఉన్న రూ.1.50 లక్షల నగదును అపహరించుకుని మోటారు సైకిల్‌పై పరారయ్యారు. అప్పట్లో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుచేసి సీసీ కెమెరాల పుటేజీని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కేసులో ఒక నిందితుడిగా ఉన్న విజయనగరంజిల్లా కొత్తవలస మండలం చీడివలస పంచాయతీకి చెందిన మేకల బాలరాజు(33)ను బుధవారం అరెస్టుచేసి అతనివద్ద నుంచి మూడు కేసుల్లో రూ.1.77లక్షల నగదుతోపాటు మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. బాలరాజుపై రావులపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో రెండు కేసులు ఉన్నాయి. ముఠాలో మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని, వీరు ఇరువురు విజయనగరం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పలు మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడగా పలు పోలీసుస్టేషన్లలో వీరిపై కేసు నమోదై ఉన్నాయి. బాలరాజును అమలాపురం ఏజీఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరుచగా 14 రోజులు రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పంపించామన్నారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ పి.వీరబాబు, ఎస్ఐ టి.తిరుమలరావు దర్యాప్తుచేశారు. ఇద్దరు నిందితులపై తెలంగాణలో పలు కేసులు నమోదయ్యాయి.

కారు ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన చల్లా సత్యనారాయణ

గండేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో నీలాద్రిరావుపేట జాతీయరహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లేపల్లి గ్రామానికి చెందిన చల్లా సత్యనారాయణ(35) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల సమాచారం ప్రకారం సత్యనారాయణ రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేటవైపు మోటార్ సైకిల్‌పై తన స్నేహితుడితో వెళుతుండగా నీలాద్రిరావుపేట గ్రామం వచ్చేసరికి వెనుక వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో సత్యనారాయణ తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా స్నేహితుడు దుర్గారావుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ ను నియంత్రించి సత్యనారాయణ మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టంకు తరలించి కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంటిని పోషించే వ్యక్తి మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడిందని కుటుంబీకులు రోదిస్తున్నారు.

చికిత్సపొందుతూ తల్లి, కుమారుడు మృతి

ఆత్రేయపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలో ప్రమాదవశాత్తూ పెట్రోల్ మంటలు చేలరేగి నిప్పు అంటుకుని తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న తల్లి, కుమారుడు మృతి చెందారు. ఈసంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. లొల్ల గ్రామానికి చెందిన చి ట్టూరి లక్ష్మీకాంతం(54), ఈనెల 14న రాత్రి 9గంటల సమయంలో తన కిరాణాషాపులో ఉన్న పెట్రోలు కింద ప డి మంటలు ఏర్పడటంతో ఆమె తీవ్రంగా గాయపడగా, అదే సమయంలో అక్కడే ఉన్న పెద్దకుమారుడు సాయి కృష్ణ మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా గాయపడ్డాడు. ఇద్దరినీ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించా రు. మంగళవారంరాత్రి పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ లక్ష్మీకాంతం మృతి చెందారు. సాయికృష్ణ పరిస్థితి విషమంగా మారడంతో బుధవారంరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ఫ్యామిలీ పెన్షనర్స్ బకాయిలు చెల్లించాలి


ట్రెజరీ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

» విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాశరావు
» పెన్షన్స్ అండ్ జీపీఎఫ్ లోక్ అదాలత్

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ పెన్షనర్స్‌కు అదనపు క్వాంటమ్ గడువు తీరిన నాటి నుంచి బకాయిలు చెల్లించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సూర్య ప్రకాశరావు, యర్రమోతు ధర్మరాజు కోరారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో బుధవారం పెన్షన్స్ అండ్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విశ్రాంతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపాల్ అండ్ అకౌంటెంట్ జనరల్ సరెళ్ల శాంతి ప్రియకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ విశ్రాంత ఉద్యోగికి వేతన సవరణ వివరాల స్టేట్‌మెంట్ అందించాలని, విశ్రాంత ఉద్యోగికి పెన్షన్ అందించే విషయంలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. తదుపరి ఏపీఎస్ టీఆర్ఏ జిల్లా అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ మూర్తితో కలిసి డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి ఎన్.మోహనరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఖజానా అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

'నన్నయ' వీసీగా ప్రసన్నశ్రీ నియామకంపై హర్షం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అతిపెద్దదైన నన్నయ విశ్వవిద్యాలయానికి సత్తుపాటి ప్రసన్నశ్రీని వైస్ చాన్స్‌లర్‌గా నియమించడం పట్ల రాష్ట్ర ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లూరి బాబురాజేంద్రప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక దేవిచౌక్‌లోని రత్నం ఆర్గనైజేషన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక గిరిజన మహిళను వీసీగా నియమించిన సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ప్రసన్నశ్రీ గిరిజనుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, 19 గిరిజన భాషలకు లిపిని రూపొందించారని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను అందుకున్నారన్నారు.

జనసేనలో చేరికలు

రాజానగరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బుధవారం జనసేన పార్టీలోకి చేరారు. రాజానగరం, నరేంద్రపురం, నందరాడ, కొత్తవెలుగుబంద, పాతవెలుగుబంద, సూర్యారావుపేట, కలవచర్ల, నామవరం తదితర గ్రామాలకు చెందిన దాదాపు 500 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పార్టీ కండువా మెడలో వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే బత్తుల

ధ్రువపత్రాలు సకాలంలో జారీ చేయాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సకాలంలో జనన, మరణ, వివాహ, ఆదాయ ధ్రువపత్రాలను జారీ చేయడంలో మునిసిపల్, సచివాలయ సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ధ్రువపత్రాల జారీపై బుధవారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ ధ్రువపత్రాలను సకాలంలో పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి ప్రయోజనాలు, ఆవశ్యకతను వివరించారు. శాశ్వత లోక్ అదాలత్ సేవలను అందరూ వినియోగించుకోవాలని అదాలత్ చైర్మన్ గాయత్రిదేవి సూచించారు. ప్రస్తుత కాలంలో పెళ్లి ధ్రువపత్రం తప్పనిసరిగా తీసుకోవాలని రాజమహేంద్రవరం సబ్-రిజిస్ట్రారు ఆర్.రాంబాబు తెలిపారు. ఆ ధ్రువపత్రం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. తమ వద్దకు వస్తే సహాయ పడడంతోపాటు సాధ్యమైనంత త్వరగా ధ్రువపత్రాలు అందజేస్తున్నామన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

రాజానగరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతిని రాజానగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ హిందూ ధర్మ సంస్థాపన, పరిరక్షణకు శివాజీ ఎంతో శ్రమించారని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఛత్రపతి ధైర్యసాహసాలు, దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.హేమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా శివాజీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు మైలవరపు సాయిరాం మాట్లాడుతూ మొఘలుల దురాగతాలను ఎదురించి హైందవ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను శివాజీ కాపాడారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మండవిల్లి గుప్త, ఉండవిల్లి మాణిక్యం, ఎం.సాయిరాం, పోతుల చిన్నికాపు, గుండుబిల్లి ప్రసాద్, సూర్య భాస్కర్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ పాటించాలి

అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు రమణ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరిపే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్ పాటించాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ రమణ కోరారు. నన్నయ వర్సిటీని ఆయన బుధవారం సందర్శించి రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్‌తో సమావేశమయ్యారు. గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక విభాగం, గిరిజన మ్యూజియం, ప్రత్యేక పరిశోధనా విభాగం ఏర్పాటు చేయాలని కోరారు. హాస్టల్లోని విద్యార్థులందరికీ పరిశుభ్రమైన ఆహారం అందించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్ఎస్ వరహాలదొర అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమణ పాల్గొని విద్యార్థులు, బోధన, బోధనేతర ఉద్యోగులతో మాట్లాడారు. తాడేపల్లిగూడెం పీజీ కేంద్రం ప్రిన్సిపాల్ ఆచార్య టి.అశోక్, సహాయాచార్యులు పి.కృష్ణ, జాతీయ సమన్వయకర్త బి.నాగార్జున పాల్గొన్నారు.

మహాశివరాత్రికి గోదావరి రేవులను సిద్ధం చేయండి

మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రికి పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా రేవులను సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. బుధవారం రాజమహేంద్రవరంలో గోదావరి స్నానాల రేవులను అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవులను పరిశుభ్రంగా సిద్ధం చేయాలని, ఎక్కడికక్కడ డెస్ట్‌బిన్నులు ఏర్పాటు చేయాలని, రేవులు కలిగివున్న వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లతో పాటు మేస్త్రీలకు శానిటేషన్ పర్యవేక్షించే నిమిత్తం విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలని శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్‌ను ఆదేశించారు. అలాగే నల్లా చానల్‌ను పరిశీలించి పంపింగ్ స్టేషన్ పరిస్థితిపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన నర్సరీ సంఘం

కడియం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని బుధవారం నర్సరీ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, డైరెక్టర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. టూరిజం కౌన్సిల్ సమావేశానికి నర్సరీ సంఘం నూతన పాలకవర్గ సభ్యులు హాజరయ్యారు. కలెక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో జరిగిన ఈ సమావేశంలో కడియం నర్సరీ రంగాన్ని టూరిజంగా అభివృద్ధి చేయడానికి తగిన ప్రణాళికలపై చర్చించారు. దశల వారీగా అభివృద్ధి చేయాలని, మొదటి దశగా పొట్టిలంక నుంచి వేమగిరి వరకు కెనాల్ పక్కన నర్సరీ స్టాల్స్, బోటింగ్, సందర్శకులకు జిప్‌లైన్ వంటివి ఏర్పాటుపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నర్సరీ సంఘం డైరెక్టర్లు తాడాల నాగేశ్వరరావు, గాజుల రత్తయ్య, రత్నం బాబ్జి, పిల్లా శ్రీనివాస్, మల్లు శివ పాల్గొన్నారు.

మోదీ ఫాసిస్ట్ విధానాలకు న్యూడెమోక్రసీ నిరసన

కోరుకొండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి మోదీ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 23న విజయవాడలో జరగనున్న రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం కోరుకొండ రామవనగర్‌లో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు వి.వెంకటనాయుడు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం విప్లవ కమ్యూనిస్టు పార్టీలపై ఫాసిస్ట్ ధోరణితో యుద్ధం చేస్తోందని, ఆదివాసీలపై ప్రభుత్వాలు యుద్ధాలు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా ఉండే విప్లవకారులంతా ఐక్యంగా ఉద్యమంలో పాల్గొనాల్సినవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే పదేళ్ల క్రితం రెండు చీలిపోయిన న్యూడెమోక్రసీ ఈ నెల 23న ఐక్యం కాబోతుందని పేర్కొన్నారు.

దివ్యాంగుల యోగక్షేమాలపై సర్వే

రంగంపేట,ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదరాయం, చంద్రేడు గ్రామాల్లో దివ్యాంగుల యోగక్షేమాలపై బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల ఆరోగ్య విషయాలు, పింఛను, సదరన్ సర్టిఫికెట్లు, ప్రభుత్వం పథకాలు అమలుపై వివరాలను అడిగి తెలుసుకున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు మడికి రాంబాబు తెలిపారు.

రహదారి నిబంధనలు పాటించండి


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నన్నయ యూనివర్శిటీలో రహదారి భద్రత సదస్సులో ఏఎస్పీ మురళీకృష్ణ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): యువత రహదారి నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఏఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ అన్నారు. రోడ్డు ప్రమాదం జరిగితే ప్రమాదానికి గురైన వారు మాత్రమే కాకుండా వారి కుటుంబాలు కూడా నష్టపోతాయన్నారు. ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయంలో బుధవారం రహదారి భద్రత, కౌమారదశలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఎస్పీ మాట్లాడుతూ సాధారణ మరణాల కంటే ప్రమాదాల బారిన పడి చనిపోయే వారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల బారిన పడి 2022లో 313 మంది, 2023లో 349 మంది, 2024లో 243 మంది చనిపోయారన్నారు. కొద్దిగా ముందుగా బయలుదేరి సజావుగా ప్రయాణం చేసే అలవాటు చేసుకోవాలని చెప్పారు. ప్రమాదంలో క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రిలో చేరిస్తే వారి ప్రాణం కాపాడినట్లు అవుతుందని, అటువంటి వారికి ప్రభుత్వం నుంచి రూ.5 వేలు నగదు ప్రోత్సాహకం అందిస్తున్నామని తెలిపారు. నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ హైస్పీడ్ వాహనాల సంఖ్య పెరగడంతో అతివేగంతో వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అలాగే ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటిస్తూ క్యాన్సర్‌కు దూరంగా ఉండాలన్నారు. డీఎస్పీ బి.విద్య, అంకాలజిస్ట్ డాక్టర్ విశ్వనాథ్ పట్నాల, కార్యక్రమ సమన్వయకర్త ఎన్.ఉదయభాస్కర్, ప్రిన్సిపాల్స్ డి.జ్యోతిర్మయి, పి.విజయనిర్మల, పి.వెంకటేశ్వరరావు, లీగల్‌ఈఫీసర్ ఎన్.నాగేంద్ర, సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్, ఎస్ఐ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

'పేరాబత్తుల'కు తొలి ప్రాధాన్య ఓటేయండి


పాలచర్ల బీవీసీ కాలేజీలో ప్రచారం చేస్తున్న బీవీఆర్ చౌదరి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి

దివాన్‌చెరువు, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి కోరారు. ఈ మేరకు రాజానగరం మండలం పాలచర్లలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిచ్చి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుతో బాటు అనేక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటోందని, మంత్రి లోకేశ్ విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంక మల్లిబాబు, కొల్లం రత్నం, గంగిశెట్టి చంటిబాబు, నూనె వెంకన్న, కందుల బాబూరాయుడు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలోని మోరంపూడి ఎల్‌ఐసీ కార్యాలయం, శ్రీనగర్, వీఎల్‌పురం తదితర ప్రాంతాల్లో పట్టభద్రులైన ఓటర్లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఓట్లు అభ్యర్థించారు. పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్య ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఒక్క అవకాశం ఇస్తే పట్టభద్రుల ప్రయోజనాలను కాపాడుతారన్నారు. నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తారన్నారు. అలాగే స్థానిక 11వ డివిజన్‌లోని తిలక్‌రోడ్డు, ఏపీఏ రోడ్డు, జేఎన్ రోడ్డు ప్రాంతాల్లో మా జీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆదిత్య, శ్రీచైతన్య, నారాయణ, శిరిడిసాయి, శశి కళాశాలల్లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశి నవీన్‌కు మార్ ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి పేరాబత్తులకు తొలి ప్రాధాన్య ఓటు వే యాలని అభ్యర్థించారు. కార్యక్రమాల్లో కంటిపూడి రాజేంద్రప్రసాద్, బత్తుల రవికిరణ్, చాపల చినరాజు, మదీనా సాహెబ్ పాల్గొన్నారు.

కడియం: కడియపులంక గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబులతో కలిసి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఓట్లు అభ్యర్థించారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటును వేసి విజయాన్ని చేకూర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో వెలుగుబంటి నాని, మార్గాని సత్యనారాయణ, పాటంశెట్టి రాంజీ, బోడపాటి గోపి, గట్టి సుబ్బారావు, బొర్సు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గ్రామదేవత మునలమ్మను ఎమ్మెల్యే దర్శించుకుని పూజలు నిర్వహించారు. బెల్లంతో తులాభారం ఏర్పాటు చేసి మొక్కు చెల్లించారు.


ఎల్ఐసీ కార్యాలయంలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


కడియపులంకలో కరపత్రం ఇచ్చి ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

'జ్ఞానజ్యోతి'తో చిన్నారుల సమగ్రాభివృద్ధి

» అర్బన్ డీఐ దిలీప్‌కుమార్
» అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసమే జ్ఞాన జ్యోతి శిక్షణ ఇస్తున్నట్టు అర్బన్ డీఐ దిలీప్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ నరసమ్మ తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలకు స్థానిక ఆర్యాపురంలోని నన్నయ మునిసిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆటపాటలతో విద్యను నేర్పే విధానంలో మెళకువలను ఈ శిక్షణ ద్వారా అందిస్తారని, అభ్యాసనా నైపుణ్యాలు పెంపొందిస్తారన్నారు.

రంగంపేట: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞానజ్యోతి రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఎంఈవో కె.శ్రీనివాసరావు, కోర్సు డైరెక్టర్ వి.పార్థసారథి మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువగా ఆలోచింపజేసే సృజనాత్మక బోధనోపకరణాలు తయారు చేయడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఆకర్షణమైన బోధన చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు ఆకృతులను రంగురంగుల కాగితాలతో తయారు చేసి, చార్టుల ద్వారా వాటి అంశాలను వివరించారు. హైస్కూల్ వ్యాయామోపాధ్యాయురాలు శైల యోగాభ్యాసాలను ప్రయోగాత్మకంగా కార్యకర్తలతో చేయించారు. డీఆర్పీలు ఎన్వీ రమణాంజలి, వి.త్రిమూర్తులు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ తరగతుల్లో మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న డీఐ దిలీప్‌కుమార్

బిక్కవోలు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ గౌరిశంకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో నైపుణ్యాలను పెంచడానికే అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రీప్రైమరీ దశల్లో విద్యార్థులకు ఆటపాటలు, బొమ్మలతో విద్యా విషయిక అంశాలను నేర్పించి వారిని మరింతగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం అంగన్వాడీలు తయారు చేసిన టీఎల్ఎంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట జిల్లా పరిశీలకుడు డీఎస్‌వీ సత్యనారాయణ, ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ, హెచ్ఎం పి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.


బిక్కవోలులో మాట్లాడుతున్న ఏఎంవో గౌరిశంకర్

కడియం: కడియం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులను సర్వశిక్ష ఏఎంవో గౌరీశంకర్, డైట్ కళాశాల లెక్చరర్ డీవీవీ సత్యనారాయణ పరిశీలించారు. అన్ని గ్రామాల నుంచి 83 మంది అంగన్‌వాడీ టీచర్లు శిక్షణ పొందుతున్నారని ఎంఈవోలు ఎంఎస్ మణికుమార్, వైనాగేశ్వరరావు తెలిపారు. అనంతరం హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన హిందీభాషా దినోత్సవంలో విజేతలకు బహుమతులు అందజేశారు. హిందీ టీచర్లు విద్యార్థులతో పలు కార్యక్రమాలను ప్రదర్శింపజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, ఆర్పీలు సూర్యనారాయణమ్మ, ప్రసాద్, మూర్తి, సీఆర్పీలు పాల్గొన్నారు.

సర్వేయర్లపై యువకుల దాడి

అనపర్తి డిప్యూటీ తహశీల్దార్‌తో అసభ్య ప్రవర్తన..కేసు నమోదు

అనపర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు సర్వేయర్లపై దాడి, ఓ మహిళా డిప్యూటీ తహశీల్దార్‌పై అసభ్య ప్రవర్తనకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి పొలమూరులో ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఏఎస్ఐ దుర్గాప్రసాద్ వివరాల ప్రకారం.. అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహశీల్దార్ కర్రి శ్రీతులసి, సర్వేయర్లు పెంటపాటి వినోద్, దుర్గపవన్ రాత్రి పొద్దుపోయే వరకు విధులు నిర్వర్తించారు. దీంతో సమీప గ్రామమైన పొలమూరులో నివాసం ఉంటున్న తులసి మోటార్‌సైకిల్‌పై వెళ్లవలసి రావడంతో సర్వేయర్లు వినోద్, దుర్గాపవన్ ఆమెకు తోడుగా మరో బైక్‌పై బయలుదేరారు. పొలమూరు చేరుకునే సరికి అదే గ్రామానికి చెందిన నల్లమిల్లి ఆదిత్యరెడ్డి, కర్రి వెంకటరెడ్డి మద్యం మత్తులో వీరి వాహనాలను అనుసరిస్తూ డీటీపై కామెంట్లు చేస్తూ వచ్చారు. ఆమెను ఇంటి వద్ద వదిలి సర్వేయర్ల తిరిగి వెళ్తుండగా ఆదిత్యరెడ్డి, వెంకటరెడ్డి మోటార్‌సైకిల్ నిలుపదల చేసి దాడికి దిగారు. కత్తి తీసి చంపుతామని బెదిరిస్తూ తీవ్రంగా గాయపరిచారు. వారు కేకలు వేయడంతో పరారయ్యారు. గాయాలపాలైన సర్వేయర్లు స్థానికులు సహాయంతో అనపర్తి ఏరియా ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులను బుధవారం ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్ పరామర్శించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్వేయర్ పెంటపాటి వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

అనపర్తిలో అగ్ని ప్రమాదం

అనపర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అనపర్తిలోని ఇందిరానగర్‌లో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.70 వేల ఆస్తి నష్టం జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న చుక్కా కిట్టయ్య నివాసంలో ఫ్రిజ్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రమాదం సంభవించింది. దీంతో ఫ్రిజ్, టీవీ, పలు వస్తువులతో బాటు దుస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బంది అక్కడికి చేరుకుని వంటగదిలో ఉన్న సిలెండర్‌కు మంటలు వ్యాపించకుండా బయటకు తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని, సుమారు రూ.70 వేల వరకు ఆస్తి నష్టం ఉంటుందని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

లక్ష్మీనరసింహుడి రథానికి మరమ్మతులు!

కల్యాణోత్సవాల కోసం రథశాల నుంచి బయటకు తీసిన ఆలయ అధికారులు

కోరుకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల కోసం రథశాల నుంచి బుధవారం రథాన్ని బయటకు తీశారు. అంతకుముందు ఆలయ అనువంశిక ధర్మకర్త చైర్మన్ పరాసర రంగరాజ భట్టర్, శ్రీ లక్ష్మీనరసింహ భట్టర్, అర్చక స్వాములు, అన్నవరం దేవస్థానం అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో పూజలు నిర్వహించి వడ్డీలు స్వామి వారిరథాన్ని రథశాల నుంచి భక్తుల సహకారంతో బయటకు తీశారు. రంగరాజభట్టర్ మాట్లాడుతూ మార్చి 10 నుంచి 5 రోజులపాటు స్వామి వారి కల్యాణోత్సవాల కోసం రథాన్ని బయటకు తీశామన్నారు. అన్నవరం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు రథాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేసిన తరువాత కల్యాణోత్సవం ముందురోజు రథోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, జనసేన నాయకుడు బదిరెడ్డి దొర, అనువంశిక అర్చకస్వాములు పాల్గొన్నారు.

21న కాకినాడలో
పింఛను అదాలత్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పింఛను, జీపీఎఫ్‌కు సంబంధించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 21న కాకినాడలో పింఛను, జీపీఎఫ్‌కు అదాలత్ నిర్వహిస్తున్నట్టు ఖజానా శాఖ రాష్ట్ర సంచాలకుడు ఎన్.మోహనరావు తెలిపారు. బుధవారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన పింఛను, జీపీఎఫ్‌కు అదాలత్‌కు విచ్చేసిన ఆయన్ను స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో రాష్ట్ర ఏఈవోల సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవరావు ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు కలిసారు. పదవీవిరమణ పొందిన పింఛనుదారులు తమ సమస్యల పరిష్కారానికి వ్యయప్రయాసలకు ఓర్చి విజయవాడ రాకుండా అకౌంటెంట్ జనరల్ ఆధ్వర్యంలో తామే జిల్లాలకు వస్తున్నట్టు మోహనరావు తెలిపారు. ఈ అదాలత్‌ను పింఛనుదారులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఖజానా అధికారి ఎన్.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శుల సంఘం డివిజన్ అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు, మీసాల మాధవరావు, సీహెచ్ విజయకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ మహమ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి
మేనమామ మృతి
మేనల్లుడికి గాయాలు


సుధాకర్(ఫైల్)

అనపర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బతుకు తెరువు కోసం పనికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఏఎస్ఐ దుర్గాప్రసాద్ వివరాల ప్రకారం.. అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన కాతేటి సుధాకర్(33) తన మేనల్లుడు శెట్టి శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం పనికి సోమేశ్వరం వెళ్లాడు. పనులు ముగించుకుని రాత్రికి ఇంటికి బైక్‌పై వస్తుండగా సోమేశ్వరం రోడ్డులో అదుపుతప్పి పంటకాలువలో దూసుకుపోవడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. సమీపంలోని బట్టీ కార్మికులు గమనించి వీరిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సుధాకర్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించగా శ్రీనివాసరావు చికిత్స పొందుతున్నాడు. కాగా సుధాకర్‌కు భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. పనికి వెళ్ళిన భర్త విగత జీవిగా తిరిగిరావడంతో భార్య రోదిస్తున్న తీరు పలువురిని కలచివేసింది. ఈ ఘటనతో కుతుకులూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ఏఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్‌కే
విజయావకాశాలు
మాజీ ఎంపీ హర్షకుమార్

అనపర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తనయుడు జీవీ సుందర్‌కు విజయావకాశాలు మెండుగా ఉన్నాయని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా అనపర్తి వచ్చిన ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ ప్రమేయాలు ఉండరాదని, అర్హత కలిగిన వ్యక్తిని ఎన్నుకోవాలన్నారు. నిరుద్యోగ సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న సుందర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరుతూ అనపర్తికి వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హర్షకుమార్ వెంట మాల మహానాడు నాయకుడు నల్లా చిన్నారావు తదితరులున్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యామినీ	: కెప్టెన్ అమెరికా
సూర్యాప్యాలస్	: చావా
స్వామి	: బ్రహ్మాఆనందం
శివజ్యోతి	: తండేల్
అనుశ్రీ(సాయికృష్ణ)	: లైలా
రాజా	: సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి	: కాంప్లికేటెడ్
రంభ	: ఆరెంజ్
మేనక	: నిదురించు జహాపన, తల
అప్సర	: తండేల్
కుమారి	: కెప్టెన్ అమెరికా
అశోక	: లైలా
వీఎస్ మహల్(నామవరం)	: తండేల్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: తండేల్
వెంకటసూర్య(కడియం)	: లైలా, తండేల్
సత్యగౌరి (అనపర్తి)	: లైలా
సూర్యశ్రీ (అనపర్తి)	: తండేల్
ఫార్ఛ్యూన్ సినిమాస్(రాజానగరం)	: తండేల్
రామకృష్ణ(కోరుకొండ)	: ---
గీతాసినిమాస్ (సీతానగరం)	: లైలా
శ్రీనివాస (గోకవరం)	: తండేల్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: లైలా
లలితామహల్(రంపచోడవరం)	: తండేల్
నవయుగ(చింతూరు)	: లైలా







ఏ వెండి.. పెరుగుతుందండీ!

- రూ.లక్షకు చేరువలో వెండి ధరలు
- కిలో రూ.99,800.. బంగారం పైపైకే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వెండి ధరలు బంగారంతో పోటీ పడుతున్నాయి. ఇవాళ్టికిలో వెండి ధర రూ.లక్షకు చేరువగా ఉంది. ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.99,800గా ఉంది. బంగారం ధర పది గ్రాముల 22 క్యారెట్ ధర 80,350 అయింది. ఇంకా ఈ ధరలు పెరిగే అవకాశాలున్నట్టు మార్కెట్ అంచనా. బంగారం, వెండి ఆభరణాలంటే మహిళలకు ఎంతో మోజు. పురుషులూ ఈమధ్య వీటిపై మోజు పెంచుకుంటున్నారు. సాధారణంగా వెండి కంటే బంగారం ధరించడానికి స్త్రీ, పురుషులు ఇష్టపడతారు. వెండితో సాధారణంగా ప్లేటులు, గ్లాసులు వంటి వస్తువులను ఇంటిలోకి ఉపయోగిస్తారు. పూజా సామగ్రి కూడా వెండివే వినియోగిస్తారు. ఇటీవల పెట్టుబడి కింద కూడా వెండిని ఉపయోగిస్తున్నారు. వెండిబారులు ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు. ఇవి 50 గ్రాముల బారు నుంచి కిలో బారు వరకూ ఉంటుంది. ఇవికాకుండా గోల్డ్ కోటెడ్ వెండి ఆభరణాలకు ధరించే ట్రెండ్ నడుస్తోంది. వెండి పట్టీలు ఎలాగూ ప్రతీ మహిళా ధరిస్తారు. బంగారం ధరలు పెరగడం, చోరీల నుంచి రక్షణ పొందేందుకు ఇలా వెండి నగలను ధరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బంగారం ధరతోపాటు వెండి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులూ వెండి ధరలను ప్రభావితం చేస్తున్నాయి. కొంతకాలంగా బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్న సంగతి తెలిసిందే. బంగారంతోపాటు వెండి ధరలు కూడా పోటీపడుతుండడం విశేషం. గతవారంలో కిలో వెండి ధర రూ.99,900 పలికింది. తర్వాత రూ.200 తగ్గి కిలో రూ.99,700గా కొనసాగింది. బుధవారం మళ్లీ పెరిగిపోయి 99,800 అయింది. ఇది ఇంకా తగ్గుతుందా, పెరుగుతుందా అనే అంచనా వేయలేని పరిస్థితి ఉంది. అయితే కిలో వెండి రూ.లక్ష ధర పలికే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. వినియోగదారులు ప్రస్తుతం వెండి కొనుగోలు చేద్దామంటే ధర ఎక్కువ ఉంది. తర్వాత కొనుగోలు చేయవచ్చని వాయిదా వేద్దామంటే మరింత పెరిగిపోతుందేమోననే ఆందోళన ప్రజల్లో ఉంది. జనవరి ఒకటిన కిలో వెండి ధర రూ.88,400 ఉంది. నెలా పదిహేను రోజుల తర్వాత అంటే ఇవాళ కిలో ధర రూ.99,800లకు చేరింది. బుధవారం నాడు బంగారం 22 క్యారెట్ పది గ్రాముల ధర 80,350, 24 క్యారెట్ బంగారం ధర రూ.87,650 ఉంది.

చిదిమేస్తున్నారు!

మోసగాళ్ల చెరలో మైనర్లు





మాయమాటలో, విష సంస్కృతో అభంశుభం తెలియని బాలికలను విష వలయంలోకి నెట్టేస్తోంది. ఆ వలయంలో చిక్కిన వారి జీవితాలు అగాధంలో పడిపోతున్నాయి. తర్వాత లేచి చూస్తే.. అంతా చీకటే. ఎంతో భవిష్యత్తును చూడాల్సిన మైనర్లు జీవచ్ఛవాలుగా మిగిలిపోతున్నారు. మైనర్లపై ఇటీవల అత్యాచారాలు జరుగుతున్న ఉదంతాలెన్నో నమోదవుతున్నాయి. ఈవారం పది రోజుల్లోనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక ఘటనలు పోలీసు కేసులయ్యాయి. కేసుల దాకా రానివీ మరెన్నో ఉంటాయి. వీరికి న్యాయం జరుగుతుందా, నిందితులకు శిక్ష పడుతుందా.. ఇంతవరకే మనం ఆలోచించగలం. కానీ అఘాయిత్యానికి గురైన మైనర్లు, మహిళల భవిష్యత్తు మాత్రం గాడాంధకారమే. పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే కొంతవరకైనా కట్టడి అయ్యే అవకాశం ఉంటుంది.

- బాలికలకు భద్రత కరవు
- పోక్సో కేసులే దానికి రుజువు
- రోజురోజుకూ మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు
- ప్రేమ పేరుతో వలలో చిక్కుతున్న యువతులు
- స్మార్ట్ ఫోన్ల బంధాలతోనూ వాటిల్లుతున్న పెనుముప్పు
- జిల్లాల్లో పెరిగిపోతున్న మిస్సింగ్ కేసులు

(రాజమహేంద్రవరం/సామర్లకోట/మండపేట/ముమ్మిడివరం/మలికిపురం- ఆంధ్రజ్యోతి)

బాలికలకు, మహిళలకు భద్రత కరువైంది. ప్రధానంగా ప్రేమపేరుతో బాలికలు, యువతులు మోసగాళ్ల చెరలో చిక్కుతున్నారు. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మిస్సింగ్ కేసుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నాయి. దీనికి కుటుంబ పరిస్థితులు, గృహహింస, తల్లిదండ్రుల సంబంధాలు, తల్లి లేదా తండ్రి ఒక్కరే ఉండడంతో ఒంటరితనం, మద్యం వంటి వాటికి బానిస కావడం, పిల్లలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, సామాజిక మాధ్యమాల ప్రభావం, ఆకర్షణలకు గురికావడం ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయని కిర్లంపూడి పీహెచ్‌సీలో వైద్యునిగా పనిచేస్తున్న డాక్టర్ ప్రసాద్ చెప్పారు. నిజమే, ప్రధానంగా స్మార్ట్‌ఫోన్ల వల్ల ఆడ, మగ తేడా లేకుండా జీవితాలు పట్టు తప్పుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అత్యాచారం, అదృశ్యం కేసుల్లో లోతుల పరిశీలన చేస్తే చివరికి సెల్‌ఫోన్ కారణమని తేలుతోంది. కలిసి చదువుకుంటున్నాం.. కలిసి తిరిగేస్తే తప్పేంటనే తొందరపాటే అమ్మాయిల జీవితాలను ప్రశ్నల కూపంలోకి నెట్టేస్తోంది. ప్రేమ.. ఆకర్షణ.. అవసరం.. వాంఛ.. వీటి మధ్య ఉన్న సున్నితమైన గీతను గుర్తించడంలో విఫలమవుతున్న అమ్మాయిలు అమాయకంగా తమంతట తాముగా వెళ్లి జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు.

ఇవి కొన్నే...

మాయ మాటలతో వ్యభిచారంలోకి

అనకాపల్లి జిల్లాకు చెందిన 17ఏళ్ల బాలికను కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన చందు ప్రేమపేరిట మాయమాటలు చెప్పి గతేడాది చివరల్లో ఇక్కడకు తీసుకువచ్చాడు. ఆ తర్వాత తన ప్రణాళిక ప్రకారం బాలికను వ్యభిచారంలోకి దింపేందుకు తన తల్లిని వినియోగించాడు. ఈ కూపంలో ఆ బాలికకు ఇన్ఫెక్షన్ సోకడంతో వైద్యం చేయించారు. బాధలతోపాటు తల్లీకొడుకులు పెట్టే బాధలు భరించలేక గతేడాది చివర్లోనే ఆమె చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్సలో ఆ బాలిక ఆరోగ్యం మరింత క్షీణించింది. పోలీసులకు ఫిర్యాదు అందడంతో తీగలాగితే డొంక కదిలింది. పెద్దాపురం పోలీసులు రంగప్రవేశం చేసి బాలికను మోసగించి, వేధింపులకు పాల్పడిన తల్లీకొడుకులను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బాలిక ఆస్పత్రిలో అవసానదశలో చికిత్స పొందుతోంది. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

8వ తరగతి బాలికను చెరపట్టి...

ముమ్మిడివరం మండలం అనాతవరం గ్రామానికి చెందిన పరమట దుర్గాప్రసాద్ (30) ఎలియాస్ బులిచంటి 8వ తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికపై కన్నేశాడు. గత సోమవారం ఆ బాలిక ఇంటి నుంచి పాఠశాలకు తోటి విద్యార్థినులతో కలిసి వెళ్లి స్కూలు వద్ద బస్సు దిగగా దుర్గాప్రసాద్ మోటారు సైకిల్‌పై వచ్చి ఆమెకు మాయ మాటలు చెప్పి బలవంతంగా మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని అమలాపురం ఎర్రవంతెన సమీపంలోని ఒక నివాస గృహంలోకి తీసుకువెళ్లి శారీరకంగా అనుభవించాడు. ఈ విషయం తెలిసిన ఆ బాలిక తండ్రి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదుచేసి ఆ బాలికను వైద్య పరీక్షలకు పంపించి నిందితుడిపై పోక్సో అత్యాచార కేసును నమోదుచేశారు.

ప్రేమ పేరిట వేధించి.. ఆత్మహత్యకు పురిగొల్పి..

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం మాధవపట్నంలో అనుసూరి విఘ్నేశ్ అనే యువకుడి వేధింపులకు తాళలేక మూడు రోజుల కిందట 17 ఏళ్ల బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. గతంలో అతడు ఆ బాలికను ప్రేమపేరిట వేధించేవాడు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు అప్పట్లో అతడిపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి జైలుకు పంపారు. కొన్నాళ్లకు బెయిల్‌పై బయటకు వచ్చిన అతడు ఆ బాలిక వద్దకు వెళ్లి పెళ్లి చేసుకుంటానని తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేశాడు. మాయమాటలకు లొంగిన ఆ బాలిక వివాహం చేసుకుంది. కొంతకాలం అదే గ్రామంలో ఇద్దరూ కాపురం పెట్టారు. ఇటీవల కాలంలో ఆమెపై వేధింపులు పెరిగాయి. రెండు రోజులుగా వారిద్దరి మధ్య ఘర్షణలు జరగ్గా ఆమెను శారీరకంగా వేధించాడని తెలిసింది. సోమవారం రాత్రి ఆమె అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు విఘ్నేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఫొటోలు పంపి.. వేధించాడు...

రాజమహేంద్రవరం నగరానికి చెందిన ఓ అమ్మాయికి ఓ యువకుడు పదేపదే ఫోన్లు చేసి వేధిస్తున్నాడు. ఆమె ఎన్ని ఫోన్ నెంబర్లు మార్చినా ఫలితం లేకపోతోంది. చివరికి ఆమె తండ్రికి ఆమె పర్సనల్ ఫొటోలు పంపించాడు. అది చూసి ఆ తండ్రి గుండె పగిలినంత పనైంది. కూతురిని గట్టిగా నిలదీస్తే కథ బయటకు వచ్చింది. ఆ కుర్రాడు ఆ అమ్మాయితో చదువుకున్నవాడే. ఆ రోజుల్లో చనువుండేది. ఇప్పుడు ఆ అమ్మాయికి పెళ్లి నిశ్చయం కావడంతో ఆ అబ్బాయి తీరు విపరీతమైంది.

పెళ్లి చేసుకుంటానని లోబరుచుకుని..

మండపేట పట్టణంలోని గొల్లపుంత కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ క్రాంతికుమార్ అదే పట్టణంలో పదవ తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారం చేశాడు. ఇతడికి ఇంతకుముందే వివాహమై కుమారుడు కూడా ఉన్నారు. నిందితుడి ఇంటికి సమీపంలోనే ఆ బాలిక కుటుంబం ఉండడంతో పరిచయం పెంచుకుని అఘాయిత్యానికి పాల్పడ్డారు. పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో లోబరుచుకున్నట్టు తేలింది.

ఆత్మరక్షణపై శిక్షణ ఉండాలి

అత్యాచారాలు, అఘాయిత్యాల నుంచి తప్పించుకునేందుకు అవగాహనతోపాటు ఆత్మరక్షణపై పాఠశాలల్లో శిక్షణ ఇవ్వాలి. ప్రతీ ఒక్కరు బాలికలకే జాగ్రత్తలు చెబుతారుతప్ప బాలురకు కౌన్సెలింగ్‌గానీ, శిక్షణగానీ ఇవ్వడం లేదు.. బాలికలతో బాలురు ఎలా మెలగాలనేది కూడా కుటుంబ స్థాయిలోనే పెంపకంలోనే అలవాటు చేయాలి. వీటికి తల్లే ముఖ్య బోధకురాలు కావాలి. బాల్య దశలోనే నీతి సూత్రాలు, మంచి కథలు వినిపించాలి.

- నల్లి సన్‌షైన్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

సోషల్ మీడియా ఓ కత్తి..

సోషల్ మీడియా ఓ కత్తి వంటిది. దానితో మంచి చెడూ రెండూ ఉన్నాయి. అయితే చెడు మార్గంలోకి వెళ్లడానికి ఈరోజు యువత దానిని ఎక్కువగా వాడుతోంది. చెడు కంటెంట్ కూడా విపరీతమైన లభ్యత వల్ల బాలలు సైతం కొన్ని కేసుల్లో ఉండడం మనం చూస్తున్నాం. పిల్లల సెల్‌ఫోన్లను పెద్దలు గమనిస్తూ ఉండాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలతో స్నేహభావంతో మెలుగుతూ అన్ని విషయాలనూ గమనిస్తూ, ఆరా తీస్తూ ఉండాలి. ఆదర్శనీయులు, మార్గదర్శకులు, నీతి కథలు, జీవితంపై చెడు చూపించే ప్రభావం, కుటుంబ విలువలు వంటి వాటిని నూరిపోస్తూ ఉంటే మంచిది.

- డాక్టర్ కర్రి రామారెడ్డి, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు



జిల్లా పర్యాటక కమిటీ మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి. చిత్రంలో డీఆర్వో, ఫారెస్ట్ అధికారి, ఏజెన్సీల ప్రతినిధులు

హైవేలో నర్సరీ స్టాల్స్ ఆసక్తి చూపేవారిని గుర్తించాలి

ఆగస్టుకి జిల్లాలో ప్రతిపాదిత టూరిజం పనులన్నీ కార్యరూపం దాల్చాలి

జిల్లా పర్యాటక కమిటీ సమావేశంలో కలెక్టర్ పి. ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో నర్సరీల స్టాల్స్ ఏర్పాటుచేస్తే బాగుంటుంది. వాటి నిర్వహణ పట్ల ఆసక్తి ఉన్నవారిని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధంచేయాలి. కడియం నర్సరీలు, ఫ్లవర్ మార్కెట్, స్వయం సహాయక సంఘాలు, చేనేత కుటుంబాలను గుర్తించి లీజు విధానంలో స్టాల్స్ ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికార్లను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు ఆఫీసులో తన అధ్యక్షతన బుధవారం జరిగిన జిల్లా పర్యాటక కమిటీ సమావేశంలో ఆమె ప్రతిపాదిత ప్రాజెక్టులను సమీక్షించి పలు సూచనలు చేశారు. ఆగస్టు నెలకు జిల్లాలో ఇప్పటివరకూ ప్రతిపాదించిన పర్యాటక ప్రాజెక్టు పనులన్నీ కార్యరూపం దాల్చాలన్నారు. వాటి అభివృద్ధికి వివిధ ఏజెన్సీలను గుర్తించి ప్రత్యేక ప్రతిపాదనలతో అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పొట్టిలంక నుంచి కడియపులంక వరకూ జాతీయ రహదారిలో నిర్దిష్ట పరిమాణంలో స్టాల్స్ ఏర్పాటుచేసి అక్కడ నీరు, విద్యుత్, సీసీ కెమేరాల వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కమిటీ మరో సమావేశంలో లీజు ధర నిర్ణయిస్తుందని, ఆసక్తి చూపించే వర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. వీటి స్వీకరణలో నర్సరీ అసోసియేషన్ అభ్యర్థించిన సమయం ఇవ్వాలని చెప్పారు. కడియపులంక ప్రాంతంలో కాలువలో ఒక కిలోమీటరు మేర బోటింగ్ సౌకర్యం ఏర్పాటుచేసి, దశలవారీగా నిడివి పెంచాలని, వేమగిరి నుంచి కడియపులంక వరకూ 10 సీట్ల డీలక్స్ బోట్లు ఏర్పాటు, శిల్పారామం సొసైటీ అభివృద్ధికి అనువైన భూమిని గుర్తించాలని కోరారు. కడియం నర్సరీలకు సంబంధించి కొత్త కమిటీ ఆధ్వర్యంలో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఆశాభావం వ్యక్తంచేశారు. హేవలాక్ వంతెన కోసం మార్పిడి ప్రక్రియ, టూరిజం, బడ్జెట్ హోటల్ అభివృద్ధి చేయడానికి, 5స్టార్ హోటల్ నిర్మాణానికి భూమిని గుర్తించాలని, బ్రిడ్జిలంక ద్వీపంలో టూరిజం అడ్వంచర్ కార్యకలాపాలు, ఫ్లోటింగ్ రెస్టారెంట్ నిర్వహణ, ట్రీ హట్స్, గ్లాస్ హౌస్‌లతో కూడిన పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు. పుణ్యక్షేత్రం తదితర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి డీపీఆర్‌లు సిద్ధంచేయాలని ఆదేశించారు. నగరవనం తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, విడిది, సాహస క్రీడలు ఏర్పాటుచేయాలని సూచించారు. రంపచోడవరం పరిధిలో ఎకోటూరిజం ఆధారిత ప్రాజెక్టులతో కూడిన వాటిని అడాప్ట్ చేసుకోవడానికి సాధ్యాసాధ్యాలు, ప్రతిపాదనలపై నగర పాలక సంస్థ కమిషనర్‌తో సమావేశం ఏర్పాటుచేసి సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఇవ్వాలని డీఎఫ్‌వో రవీంద్రను కోరారు. ఈ సమావేశంలో ఇంచార్జి జిల్లా ఫారెస్ట్ అధికారి రవీంద్ర దామా, డీఆర్వో టి.సీతారామమూర్తి, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి ఎ.దుర్గేష్, ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్, కడియం నర్సీల అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, ఆర్ఎంసీ అదనపు కమిషనర్ వీవీ రామలింగేశ్వర్, ఆర్ఎంసీ ఎస్ఈ జీ పాండురంగారావు, జిల్లా హార్టికల్చరల్ ఆఫీసర్ బి.సుజాత, ఎంపీడీవో, టూరిజం అధికారులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు ఈ-సైన్ తిప్పలు

వైసీపీ చేసిన పాపం.. ఇప్పటికీ శాపమే

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖను బుధవారం సాంకేతిక సమస్యలు వెంటాడాయి. ఉదయం 10.30 గంటలకు కార్యాలయం తెరిచిన దగ్గర నుంచీ సబ్ రిజిస్ట్రార్లు తలపట్టుకున్నారు. రిజిస్ట్రేషన్లకు ఈ-సైన్ తప్పనిసరి. డిజిటల్ విధానంలో కక్షిదారుల సంతకాలు పూర్తయిన తర్వాత చివరిగా సబ్‌రిజిస్ట్రార్ సంతకంతో ప్రక్రియ ముగుస్తుంది. అయితే ఈ-సైన్ ఉదయం నుంచీ సమస్యగా మారింది. సాధారణంగా 5-10 నిమిషాల్లో మొత్తం పూర్తయ్యే ఈసైన్‌లో.. ఒక్కో సంతకానికి 30 నిమిషాలకుపైగా సమయం పట్టింది. కొన్ని సందర్భాల్లో గంట దాటిపోయింది. మధ్యాహ్నం 3గంటల తర్వాత మెరుగుపరిచినట్టు ప్రధాన కార్యాలయం నుంచి సమాచారం అందినా వాస్తవంగా మాత్రం ఇబ్బంది తప్పలేదు. దీంతో జిల్లాలోని 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్లు నత్తనడకన సాగాయి. కొందరు కక్షిదారులు మరుసటిరోజుకు వాయిదా వేసుకొని వెళ్లిపోయారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వాళ్లు వేచిచూడక తప్పలేదు. రైలు, బస్సు రిజర్వేషన్లు చేయించుకున్న వాళ్లు నష్టపోయారు. రాత్రి 7గంటల తర్వాత కూడా కొందరు సబ్ రిజిస్ట్రార్లు ఈ-సైన్ కరుణ కోసం వేచి చూస్తునే ఉన్నారు. గతంలో సాంకేతిక ఇబ్బంది తలెత్తినా గరిష్ఠంగా గంటలో సరి చేయడం జరిగేది. ఇప్పుడు ఏకంగా రోజంతా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-సైన్ విధానం వల్ల తరచుగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని జనం మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం కార్డ్‌ప్రైం 2.0లో భాగంగా డిజిటల్ విధానంలో సంతకాలను తీసుకొచ్చింది. అలా చేసిన సంతకాలు మాత్రమే డాక్యుమెంట్‌లో ప్రింట్ అవుతాయి. వంద ఏళ్లకు పైబడి ఉన్న వేలి ముద్రల పుస్తకాన్ని కూడా ఆ తర్వాత రద్దుచేశారు. దీంతో డిజిటల్ విధానంలో సంతకం చేయడం మాత్రమే ఏకైక మార్గంగా మారింది. ఒకవేళ న్యాయపరంగా చిక్కులు వచ్చిన సందర్భంలో ఫిజికల్‌గా సంతకాన్ని నిరూపించడానికి ఎలాంటి రిజిస్టరూ లేకుండా చేసేశారు. దీనిపై అప్పట్లోనే పెద్దఎత్తున విమర్శలు వచ్చినా జగన్ పట్టించుకోలేదు. కేవలం డిజిటల్ విధానాన్నే నమ్ముకోవడం వల్ల పెద్దగా ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తి సంతకాలు, డాక్యుమెంట్ల వివరాలు తారుమారైతే రుజువు చేసుకోడానికి రెండో ఆధారం అంటూ ఏదీ లేకుండా పోయింది. కార్డ్‌ప్రైమ్ రాకకు ముందు సంతకాల నిర్ధారణ కోసం వేలి ముద్రల పుస్తకం (టీఐఆర్) ఉపయోగపడేది. ఏదేమైనా జగన్ జమానాలో ఇష్టానుసారం తీసుకున్న నిర్ణయాల వల్ల జనం ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారని ఇది రుజువు చేస్తోంది.



ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో గంగా నదికి నమస్కరిస్తున్న ఎంపీ పురందేశ్వరి

త్రివేణి సంగమంలో ఎంపీ పురందేశ్వరి పుణ్యస్నానం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా సందర్భంగా బుధవారం రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో పవిత్ర పుణ్యస్నానం ఆచరించారు. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడుదల చేస్తూ దేశంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని ఈ సందర్భంగా గంగాదేవిని వేడుకున్నానని తెలిపారు. ఇదే స్ఫూర్తితో మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు మనందరం కంకణబద్ధులు కావాలని పురందేశ్వరి కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

కాగా కూటమి తరపున ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న పేరాబత్తుల రాజశేఖరాన్ని ఎన్నికల్లో గెలిపించాలని ఎంపీ పురందేశ్వరి కోరారు. ఈ మేరకు ఓ వీడియో సందేశాన్ని విడుదల చేస్తూ ఈనెల 27న జరిగే ఎన్నికల్లో రాజశేఖరానికి తొలి ప్రాధాన్య ఓటు వేయాలని కూటమి తరపున, బీజేపీ తరపున కోరుతున్నట్టు ఆమె పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన తొలి నెలలోనే పెన్షన్ లక్ష్యం

- రాష్ట్ర ప్రిన్సిపల్ అక్కౌంటెంట్ జనరల్ శాంతిప్రియ
- కలెక్టర్ అధ్యక్షతన పెన్షన్ అదాలత్ అవగాహన సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి ప్రతి ఒక్కరూ ఉద్యోగ విరమణ చేసిన తొలి నెలలోనే పెన్షన్ పొందడం తమ లక్ష్యమని, దీనికోసం ప్రతి ఉద్యోగి ఉద్యోగ విరమణ తేదీకి ముందే సంబంధిత డ్రాయింగ్ అండ్ పంపిణీ అధికారులకు పెన్షన్ పత్రాలను సమర్పించాలని రాష్ట్ర ప్రిన్సిపల్ అక్కౌటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ అన్నారు. పెన్షన్ అదాలత్, జీపీఎఫ్ అదాలత్ ఫలవంతమైన దిశగా నిర్వహించుకోవడం మంచి పరిణామం అని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాలులో తూర్పుగోదావరి జిల్లా పెన్షన్ అదాలత్, జీపీఎఫ్ అదాలత్, ఇతర అనుబంధ సమస్యల పరిష్కారం కోసం ఒక రోజు అవగాహన పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన సర్వీస్ సమయంలో సర్వీస్‌కు సంబంధించిన అన్ని అంశాలు సర్వీస్ రిజిస్టర్‌లో నమోదయ్యేవిధంగా చూసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ అక్కౌంటెంట్ జనరల్ శాంతిప్రియ మాట్లాడుతూ ఉద్యోగులు ఉద్యోగ విరమణ తేదీకి ముందే పెన్షన్ పత్రాలను అందచేయడం వల్ల ఆ ఉద్యోగి ఉద్యోగ విరమణ చేసిన మొదటి నెలలోనే పెన్షన్ పొందుతారన్నారు. సీనియర్ డిప్యుటీ అక్కౌటెంట్ జనరల్ పోలు కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ పదవీవిరమణ చేయడానికి ఆరు నెలల ముందే పెన్షన్ పత్రాలు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ ఎన్.మోహనరావు, డిప్యుటీ అక్కౌంటెంట్ జనరల్ లలిత్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా, ఈ సందర్భంగా పలువురు తమ పెన్షన్ మంజూరు పత్రాలను కలెక్టర్ ప్రశాంతి, ప్రిన్సిపల్ అక్కౌంటెంట్ జనరల్ శాంతిప్రియకు అందజేశారు. పలువురు పెన్షనర్లు, అధికారులు, ఉద్యోగులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



పిస్టల్‌తో గురి చూస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

పోలీసు అధికారుల ఫైరింగ్ ప్రాక్టీస్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వార్షిక డీమొబిలైజేషన్‌లో భాగంగా ఎస్ఐ నుంచి ఆపై స్థాయి అధికారులకు పెద్దాపురంలోని పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఎస్పీ నరసింహ కిషోర్ స్వయంగా హాజరై పర్యవేక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎంబీఎం మురళీకృష్ణ, ఎల్.అర్జున్, ఎల్.చెంచిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌బీడబ్ల్యులపై దృష్టిపెట్టండి.. మిస్సింగ్ కేసుల్లో వేగం పెంచాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పెండింగ్ ఎన్‌బీడబ్ల్యులు, బైండోవర్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ కేసుల్లో దర్యాప్తు వేగం పెంచాలన్నారు. దర్యాప్తులో ఉన్న అన్ని కేసుల్లోనూ త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. గ్రేవ్ ఎక్విటల్, పోక్సో, ఎస్సీ ఎస్టీ కేసుల పరిస్థితిపై ఆరా తీసిన ఎస్పీ.. పలు సూచనలు చేశారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని ఆదేశించారు. పెట్టీ కేసుల సంఖ్యను పెంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఎల్.అర్జున్, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం'


బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్ర జ్యోతి): సైబర్ మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా లీడ్ మేనేజర్ డీవీ ప్రసాద్ అన్నారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వూరు ఐసీడీఎస్ కార్యాలయంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎవేర్‌నెస్ వర్క్‌షాప్ నిర్వహించింది. దీనికి ఆయన హాజరై మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలన్నారు. నగదు రహిత లావాదేవీలు నిర్వహించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఏఎస్‌ఐ జె. ధర్మరాజు మాట్లాడుతూ ఎవరైనా సైబర్‌క్రైమ్‌కు గురయితే టోల్‌ఫ్రీ నెంబరు 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎల్‌డీఎం శ్రీధర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ వీ. ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ వీ. అశోక్‌కుమార్, రిసోర్సుపర్సన్‌లు వై. బాబూరావు, ఎన్. అనిల్, బి. సుమంత్, డి. లక్ష్మిశ్రావణి, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్డీవో ఏ. హేమసుప్రియ, ఐసీడీఎస్ సీడీపీవో డి. మమ్మీ, సూపర్‌వైజర్ ఆర్. విజయలక్ష్మి, ఉదయభాను, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు నైపుణ్య శిక్షణ


విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామ్మోహన్

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కళాశాలలో ప్రాంగణ ఎంపికల ట్రైనింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రామ్మోహన్ తెలిపారు. స్థానిక ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి, నైపుణ్యంలో వెనుబడిన విద్యార్థులను గుర్తించి కళాశాల యాజమాన్యం లెర్నెట్ స్కిల్స్, యువ, ఇన్ఫోసిస్ సంస్థలతో కలిసి 80 గంటల పాటు శిక్షణ అందజేస్తోందన్నారు. ఈ మేరకు శిక్షణ పూర్తయిన విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మా కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి ఇంకా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న విద్యార్థులు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ మాధ్యమాలలో ఇప్పటికే రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామన్నారు. లెర్నెట్ సంస్థ రీజనల్ హెడ్ ఆర్. పురుషోత్తం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి కె. సూరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ డా. వై. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ఇసుక కార్మికుల నిరసన


కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న కార్మికులు

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇసుక ర్యాంపులు తెరిచి కార్మికులకు జీవనోపాధి కల్పించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ డిమాండ్‌చేశారు. ఈ మేరకు బుధవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట గోదావరి ఇసుక కార్మిక సంఘం సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఇసుక కార్మికులకు, చిన్న పడవ యజమానులకు జీవనోపాధి కల్పించాలని, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను ఉల్లంఘించడమేనన్నారు. గోదావరి నదిలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చట్టవిరుద్ధమన్నారు. అనంతరం ఆర్డీవో డా. రాణీసుస్మితకు వినతిపత్రం అందజేశారు. నిరసనలో చోళ్ల రాజు, అప్పారావు, కృష్ణ, గోవిందు, అత్తిలి దుర్గాప్రసాద్, చీర అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్

● కొవ్వూరు, నిడదవోలులో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు
● వెలవెలబోయిన రిజిస్ట్రేషన్ కార్యాలయాలు


కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు వేచిచూస్తున్న కక్షిదారులు

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం సెంట్రల్ సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు సంబంధించి 30 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో కేవలం నాలుగు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగిన తర్వాత మళ్లీ మొరాయించింది. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కక్షిదారులు పడిగాపులు కాశారు. భూములు, ఇళ్లస్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్లకు వచ్చినవారు ఉసూరుబంటూ వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది. సాయంత్రం సర్వర్ సరి చేయడంతో రిజిస్ట్రేషన్లు ప్రారంభించగా, కేవలం నాలుగు మాత్రమే జరిగి మళ్లీ మధ్యలో ఆగిపోయింది. రిజిస్ట్రేషన్ శాఖలో తరచూ వస్తున్న సాంకేతిక సమస్యలతో కక్షిదారులు ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. ఈ సమస్య వచ్చినప్పుడు గతంలో మాదిరిగా మాన్యువల్‌లో రిజిస్ట్రేషన్ చేసే వెసులుబాటు కల్పించాలని ప్రజలు, కక్షిదారులు కోరుతున్నారు. దీనిపై కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కె. సుందరరావు మాట్లాడుతూ బుధవారం రిజిస్ట్రేషన్ల కోసం 30 దరఖాస్తులు వచ్చాయన్నారు. సెంట్రల్ సర్వర్ మొరాయించి, ఈసైట్ అవ్వకపోవడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సాయంత్రం నుంచి సర్వర్ పనిచేస్తుందని, రిజిస్ట్రేషన్లు అన్నీ పూర్తి చేసి పంపిస్తామని చెప్పారు.


నిడదవోలులో పరిస్థితి..

నిడదవోలు: జిల్లా వ్యాప్తంగా సర్వర్ మొరాయించడంతో బుధవారం ఆస్తులకు సంబంధించిన రిజి స్ట్రేషన్లు నిలిచి పోయాయి. ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకు సాంకేతిక సమస్య తలెత్తిన కారణంగా కక్షిదారులు వెనుదిరగాల్సి వచ్చింది. ప్రతిరోజూ సగటున 30కి పైగా రిజిస్ట్రేషన్లు జరిగే నిడదవోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కేవలం 12 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం సబ్‌స్టేషన్ 33 కేవీ వచ్చే విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు

ఛత్రపతి శివాజీని స్మరించుకోవాలి


శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు

తాళ్లపూడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీని ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలు పేర్కొన్నారు. తాళ్లపూడి మెయిన్‌రోడ్డులో గల గాంధీబొమ్మ సెంటరు వద్ద గల శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ మండ లాధ్యక్షుడు ఇండుగుల రామకృష్ణ, మాజీ మండలాధ్యక్షుడు కొమ్మిరెడ్డి శ్రీనివాస్, చిరువూరి శ్రీనివాస్, జి. జితేంద్ర రవి, కలిశెట్టి నాయుడు, బొర్రా శ్రీరామ్మూర్తి, అడ్డా శ్రీరామమోహన్, కడలి కిరణ్ కుమార్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


నిడదవోలులో నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

నిడదవోలు: పట్టణంలో ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందరంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల టెన్నికాయిట్ పోటీలు

గోపాలపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): చిట్యాల జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో 42వ రాష్ట్రస్థాయి స్త్రీపురుషుల టెన్నికాయిట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎల్ఎన్ శాస్త్రి, ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా, రెండు కొత్త జిల్లాలతో కలిపి 17 జిల్లాలకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజన, మైదాన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలు రేయింబవళ్లు జరిగే 22వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ముగుస్తాయన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ


దేవరపల్లిలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

దేవరపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగుతులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జడ్పీ హైస్కూల్‌లో 120 రోజుల సర్టిఫికెట్‌కోర్సు శిక్షణ ఇస్తున్నారు. బుధవారం ఎంఈవో తిరుమల దాసు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీలక్ష్మి, డీఆర్పీలు ఎంఎస్ మహాలక్ష్మి, నీరజ, శ్రీదేవి, విజయశాంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శశికళ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రాజశేఖరాన్ని గెలిపించాలి


చాగల్లులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

చాగల్లు, ఫిబ్రవరి, (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలని కూటమి నాయకులు బుధవారం మండలంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎన్నికల పరిశీలకుడు కోట్ని బాలాజీ, నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్ మండలంలోని చాగల్లు, నందిగంపాడు, ఊనగట్లలోని సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రచారాన్ని నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, కూటమి నేతలు కరుటూరి సతీష్, తాళ్ళూరి ప్రసాద్, ఈడుపుగంటి సుబ్బారావు, తాళ్ళూరి శ్రీనివాసరావు, గారపాటి శ్రీనివాసరావు, బొల్లిన శివనాగేంద్ర పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు శ్రీకాంత్ ఎంపిక

● ఈ నెల 20 నుంచి కటక్‌లో 71వ జాతీయ పురుషుల కబడ్డీ పోటీలు


శ్రీకాంత్‌ను అభినందిస్తున్న దృశ్యం

నల్లజర్ల,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ఏపీ పురుషుల కబడ్డీ జట్టులో తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన జీ . శ్రీకాంత్ ఎంపికైనట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై. శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి 18వ వరకు విశాఖపట్నంలో 20 మందితో ప్రాబబుల్స్‌కు శిక్షణ జరిగినట్టు చెప్పారు. దీనిలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది జట్టులో 12 మందిని ఎంపిక చేశామన్నారు. వారిలో అనంతపల్లికి చెందిన జీ. శ్రీకాంత్ ఉన్నారన్నారు. వీరు ఈ నెల 20వ తేదీన ఒడిశాలోని కటక్‌లో జరిగే 71వ జాతీయ పురుషుల కబడ్డీ పోటీలకు మన రాష్ట్రం తరపున ఆడతారన్నారు.

యువత సేవారంగంలో పాల్గొనాలి

● జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు


నల్లజర్లలో మొక్కలు పంపిణీ చేస్తున్న నాయకులు

నల్లజర్ల,ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): యువత సేవ చేసేందుకు ముందుకు రావాలని జనసేన పార్టీ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. బుధవారం నల్లజర్లకు చెందిన హర్ష మొబల్స్ అధినేత మల్లిపూడి రాజారావు తన తండ్రి భాస్కరరావు జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందరంగా 1000 మందికి మొక్కలు పంపిణీ చేశారు. తన తండ్రి విగ్రహం ఏర్పాటు చేసి కూటమి నేతల చేత ఆవిష్కరింపజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, అల్లాడ రాజారావు, వల్లూరి సత్తిపండు, రావూరి వెంకట రమణ, ఉన్నమట్ల సత్య కిరణ్, గుదే సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్లలో హనుమాన్ చాలీసా


ప్రత్యేక పూజలు చేస్తున్న వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, ఇతర భక్తులు

నల్లజర్ల, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): నల్లజర్లలోని రామకృష్ణ భక్త సమాజంలో బుధవారం నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు (49 రోజుల పాటు) హనుమాన్ చాలీసా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, పాకలపాటి రాంబాబు, బొమ్మిరెడ్డి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు, దేవరపల్లి మండలాల్లో వార్షిక మరమ్మతుల కారణంగా ఈనెల 21వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ నిడదవోలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. నారాయణ అప్పారావు తెలిపారు. కొవ్వూరు మండలం దేచర్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఐ. పంగిడి ఇండస్ట్రియల్, 11 కేవీ దేచర్ల లోకల్, 11 కేవీ ధర్మవరం, 11 కేవీ కాపవరం, 11 కేవీ ఐ.పంగిడి వాటర్‌వర్క్స్, 11 కేవీ త్రివేణి, 11 కేవీ ఎస్ ఎంఎల్, 11 కేవీ గౌరీపట్నం ఇండస్ట్రియల్, 11 కేవీ దుద్దుకూరు ఫీడర్లకు ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే కొవ్వూరు మండలంలోని ఐ.పంగిడి, దేచర్ల, కాపవరం,, ధర్మవరం, దేవరపల్లి మండలం గౌరీపట్నం, దుద్దుకూరు గ్రామాల ప్రజలకూ అంతరాయం ఏర్పడుతుందని కొవ్వూరురూరల్ ఏఈ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా కొవ్వూరు 33/11 కేవీ మహా పుష్కరం విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు నిడదవోలు డివిజన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్. నారాయణ అప్పారావు తెలిపారు.

తాళ్లపూడి: ప్రక్కిలంక సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం 11 కేవీ ఫీడర్‌కి శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పతుందని నిడదవోలు ఏపిఈపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. తాళ్లపూడి, ప్రక్కిలంక, వేగేశ్వరపురం, రాగోలపల్లి, బల్లిపాడు, పెద్దేవం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే రైతులకు వ్యవసాయ విద్యుత్ ఉదయం 3 గంటల నుంచి 9 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉభయ రాష్ట్రాల్లో మరిన్ని 'సంగం' ఉత్పత్తులు

● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్
● దేవరపల్లిలో డెయిరీ ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల

దేవరపల్లి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ ఉత్పత్తులను ఉభయరాష్ట్రాల్లో మరింత విస్తరిస్తామని సంగం డెయిరీ ఛైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరపల్లిలో సంగం డెయిరీ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1977వ సంవత్సరంలో రైతుల సహకారంతో సంగం డెయిరీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ డెయిరీ వ్యవస్థాపక ఛైర్మన్ యడ్లపాటి వెంకట్రావు ఎంతగానో కృషి చేశారన్నారు. అలాగే డెయిరీ ఆవిర్భావం నుంచి ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడిందన్నారు. ప్రస్తుతం డెయిరీ టర్నోవర్ రూ.1800 కోట్లని చెప్పారు. దేవరపల్లిలో మొత్తం 45 ఎకరాల్లో నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంగం డెయిరీ ఎండీ ఎస్.గోపాలకృష్ణ, జనరల్ మేనేజర్ బ్రహ్మయ్య, పీఆర్‌వో శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆండ్రూ అనిల్, రైతులు పరిమి వెంకటేశ్వరరావు, పరిమి గంగాధర్ తిలక్, సర్పంచ్ కూచిపూడి బుల్లారావు, పరిమి శ్రీరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై జరిగిన దాడులు .. గుర్తు లేదా జగన్..?

గోపాలపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): దళితులకు నేనే మేనమామనని పదేపదే సభల్లో డబ్బాకొడుతూ ఊదరగొట్టిన జగన్మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల కాలంలో దళితులపై జరిగిన దాడులు గుర్తుకు రాలేదా అని మాజీ ఎంపీటీసీ కూనపం ప్రసాద్‌బాబు ప్రశ్నించారు. బుధవారం ఆయన స్థానిక టీడీపీ ప్రాంతీయ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో దళితులపై 11500 మంది పైన దాడులు జరిగాయన్నారు. అదేవిధంగా 188 మంది దళితులను హత్య చేశారని, 637 మంది దళిత మహిళలపై అత్యాచారాలు జరిగాయని గుర్తు చేశారు. అదేవిధంగా దళిత డాక్టర్ సుధాకర్ హత్య దగ్గర నుంచి దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయన్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంలో దళిత యువకుడ్ని హింసించి కిడ్నాప్ చేసి వ్యక్తిని పరామర్శించడానికి వెళ్లిన జగన్‌రెడ్డి దళిత ద్రోహి కాదా అని ఆయన నిలదీశారు. ఈయనతోపాటు టీడీపీ నాయకులు పడమటి శ్రీనివాస్, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దాసరి రవి, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొడవటి చినవెంకటేశ్వరరావు, కొడవటి గంగరాజు, చెప్పుల శామ్యూల్‌రాజు, ముల్లిపూడి సుబ్బారావు, విజయభాస్కర్ పాల్గొన్నారు.


గోపాలపురంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీటీసీ ప్రసాద్‌బాబు

హైస్కూళ్లలో ఘనంగా హిందీ దినోత్సవం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పెరవలి మండలం కాకరపర్రు, ఖండవల్లి హైస్కూళ్లల్లో బుధవారం హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు హిందీ, సంస్కృతం గురించి వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఇతర పోటీల్లో విజేతలైన 40 మంది విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. శ్రీరామచంద్రమూర్తి, కె. ఉమ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సుల్తానా, రమాదేవి, రామాంజనేయులు, పీఈటీలు సుందర జేమ్స్, పల్లవరాజు, తదితరులు పాల్గొన్నారు.

గామన్ బ్రిడ్జిపై కారు దగ్ధం

● షార్ట్‌సర్క్యూట్ కారణం ● మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది


కారు మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏసీ కంప్రెషర్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా కారు నుంచి మంటలు చెలరేగాయి. ఈ సంఘటన కొవ్వూరు గామన్‌బ్రిడ్జిపై బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గోపాలపురం మండలం వాదాలకుంటకి చెందిన బందెల కృష్ణారావు తన ఇండిగో కారులో సీతానగరం వెళ్తున్నాడు. మార్గమధ్యలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి 33వ స్తంభం వద్దకు వచ్చేసరికి కారు నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో అందులో ఉన్నవారంతా దిగి బయటకు వచ్చేశారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ ఇన్‌చార్జి ఫైర్ అధికారి ఎస్. సీతారామయ్య తన సిబ్బందితో వచ్చి మంటలను అదుపుచేశారు. కారు పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ. లక్ష ఆస్తినష్టం సంభవించిందన్నారు. ఈ ఘటనతో గామన్‌బ్రిడ్జిపై దొమ్మేరు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే రోడ్డులో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. లీడింగ్ ఫైర్‌మేన్ పి. అప్పారావు, డ్రైవర్ ఆపరేటర్ బి. పోసియ్య, ఫైర్‌మ్యాన్‌లు ఎం. రవికుమార్, కె. ధనుంజయ, హోంగార్డులు ఎం. శ్రీను, డేవిడ్‌రాజు, పోలీసు కానిస్టేబుల్ రాంబాబు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది వచ్చారు.

గోదాట్లో దూకేశాడా?

● యువకుడి అదృశ్యం ● ఆందోళనలో కుటుంబ సభ్యులు
● రోడ్డు కం రైలు వంతెనపై కనిపించిన సాయితేజ బైక్
● నదిలో గాలిస్తున్న బంధువులు


సాయితేజ

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మండలం దొమ్మేరుకి చెందిన గగ్గురోతు సాయితేజ (25) కనిపంచడం లేదని కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. సాయితేజ రాజమహేంద్రవరంలో ఓ గేదెల ఫాంలో పనిచేస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగా నే బుధవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జిపై మోటారు సైకిల్‌ను గుర్తించారు. సాయితేజ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటం, ఆచూకీ లభించకపోవడంతో గోదావరి నదిలో జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ మేరకు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. రాత్రివరకు ఆచూకీ తెలియరాలేదు. మోటారుసైకిల్ బ్రిడ్జిపై పెట్టి ఎక్కడికైనా వెళ్లి ఉంటాడా, లేదా గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే సందేహం వ్యక్తమవుతోంది. అదృశ్యమైన యువకుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి కేసు నమోదు చేశారు.

మాయమాటలు చెప్పి... మహిళలను మోసగించి

● ఇద్దరిపై కేసు నమోదు

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మాయమాటలు చెప్పి మహిళలను మోసగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కే. శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి... రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరుకు చెందిన బొజ్జా సింధూ, ఆమె బంధువు దుద్దుకూరుకి చెందిన మరో మహిళను ఫైనాన్స్ కంపెనీలో ఇంటిపై రుణం ఇప్పిస్తానని చెప్పి నమ్మించారు. దీంతో కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కడిమి శ్రీనుబాబు, మెరిపో కృష్ణ దఫదఫాలుగా రూ. 3,45,000 తీసుకున్నారు. ఈ నెల 13వ తేదీన సింధూ తన భర్తతో కలిసి ధర్మవరం వెళ్లి అడగ్గా, ఆ ఇద్దరు వ్యక్తులు దురుసుగా మాట్లాడి, కొట్టి చంపుతానని బెదిరించారు. దీనిపై కొవ్వూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వీరన్నబాబు గద్దె నూతన ఆలయం ప్రారంభం


వేగేశ్వరపురంలో నిర్మించిన నూతన ఆలయం

తాళ్లపూడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురంలో వీరన్నబాబు గద్దె ప్రసిద్ధి చెందిన ప్రదేశం. ఇది ప్రస్తుతం పాతకాలపు పెంకుటింట్లో ఉండేది. ప్రస్తుతం దాని స్థానంలో నూతన ఆలయాన్ని పునఃనిర్మించారు. దీనిలో భాగంగా బుధవారం గణపతి హోమం, సత్యనారాయణ స్వామివ్రతాన్ని నిర్వహించారు. ఇక్కడ ప్రతి ఏటా సంబరాలు నిర్వహిస్తామని, గురువారం మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.